# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శనివారం - 20 - డిసెంబర్ 2025 | సంపుటి:3 | సంచిక:202 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in




## ఫోన్ ట్యాపింగ్ కేసు.. ప్రభాకర్ రావు కస్టోడియల్ పొడిగింపు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ గడువును మరోవారం రోజుల పాటు పొడిగించింది సుప్రీం కోర్టు. డిసెంబర్ 25 వరకు కస్టోడియల్ విచారణ చేసేందుకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. గురువారం ప్రభాకర్ రావు వారం రోజుల కస్టోడియల్ విచారణ పూర్తి అయిన విషయం తెలిసిందే.

మిగతా 2లో..

## ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపండి

పెద్దవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలి

చంద్రబాబుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వినతి

ప్రసాద్ స్కీంలో భద్రాచలానికి 200 కోట్లు విడుదల చేయండి

కేంద్రాన్ని కోరిక కవిత





2లో



## రామోజీ ఫిల్మ్ సిటీలో రాష్ట్రపతికి ఘన స్వాగతం

హైదరాబాద్, డిసెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): శీతాకాల విడిది సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు చేరుకున్నారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఆమెకు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు.రాష్ట్రపతి పర్యటనను పురస్కరించుకుని పోలీస్ శాఖ విస్తృత స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీపీ సుధీర్ బాబు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

## పంచాయితీలకు సెలవ్.. పెట్టండి

- ఎంపిటిసి,జడ్పీటిసిలకు ప్రిపేర్ కండి
- గులాబీ జెండాను హత్తుకున్న ప్రజలు
- ఇక అన్ని ఎన్నికల్లో మనమే గెలవాలి
- గెలిచిన సర్పంచ్‌ల అభినందనలో కెటిఆర్



2లో

## ప్రతి నియోజకవర్గానికి సాగునీరు

వచ్చే జూన్ నాటికి సీతారామతో నీరు అందిస్తాం

పాలేరుకు గోదావరి జలాలను రప్పించడమే లక్ష్యం

జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేసే సంకల్పంతో పనులు

మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



ఖమ్మం,(తెలంగాణ ముచ్చట్లు):

ఖమ్మం జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో రాబోయే జూన్ నాటికి 25 వేల ఎకరాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగు నీరు అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. టన్నెల్స్ అన్నింటినీ శరవేగంగా పూర్తి చేసి అన్నదాతలకు సాగు నీరు అందించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పుకొచ్చారు. పాలేరుకు గోదావరి జలాలు వస్తేనే సీతారామ లక్ష్యం పూర్తవుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు తుమ్మల. మరోవైపు స్వామి నారాయణ స్కూల్ నిర్మాణం జరుగుతోందని.. వెలుగుమట్ల అర్బన్ పార్క్ నిర్మాణం పూర్తి చేసి మంచి మ్యూజియం, పార్క్ ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జిల్లాను అన్ని విధాలా నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో జిల్లాను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడిరచారు. ఖమ్మం కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి.. ఈ సందర్భంగా కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న పనులను వివరించారు. పర్యాటక ప్రాంతంగా ఖమ్మంను అభివృద్ధి చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు మంత్రి. ప్రపంచస్థాయి డిజైన్‌తో నగరంలో క్రికెట్ స్టేడియం నిర్మాణం చేస్తున్నామని మంత్రి తుమ్మల వెల్లడిరచారు. సర్దార్ పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ పూర్తి కావొచ్చిందని వెల్లడిరచారు. ఖిల్లాకు రోప్ వే పనులు ప్రారంభమయ్యాయని.. జూన్ నాటికి మున్నేటిపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం పూర్తి కావొచ్చిందని.. అలాగే శిల్పారామం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మెడికల్ కళాశాల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఖమ్మంలో హరిత హోటల్ నిర్మాణం చేయబోతున్నామని చెప్పారు. 20ఎకరాలను టీటీడీకి అందజేస్తున్నామని.. వారి ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం జరుగుతుందని వెల్లడిరచారు. మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ మిగిలిన అన్ని చెరువులకూ కృష్ణా జలాలు అందజేస్తున్నామని అన్నారు.



## ఐటి ఉద్యోగులే టార్గెట్‌గా గంజాయి సరఫరా

రాయదుర్గంలో భారీగా గంజాయి స్వాధీనం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో గంజాయి సరఫరాను అడ్డుకునేందుకు పోలీసులు అనేక రకాలుగా చర్యలు తీసుకుంటున్నారు. గంజాయిని అమ్ముతున్నా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడో చోట గంజాయి సరఫరా జరుగుతూ పట్టుబడటం పోలీసులకు సవాల్‌గా మారింది.

మిగతా 2లో..

## 41 మంది మావోయిస్టుల లొంగుబాటు

డిజిపి శివధర్ ఎదుట లొంగిన నక్సల్స్



లొంగిన వారిలో రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎర్రగొల్ల రవి

కామారెడ్డికి చెందిన వ్యక్తిగా గుర్తింపు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

నిషేధిత మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో 41 మంది మావోయిస్టు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరిలో బటాలియన్, వివిధ డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు కూడా ఉన్నారు. మొత్తం 24 ఆయుధాలు, 733 తూటాలు, 8 బీజీఎల్ షెల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో ఇద్దరు తెలంగాణ వాళ్లు ఉండటం గమనార్హం.

మిగతా 2లో..



## పేద విద్యార్థినీ భవిష్యత్తుకు అండగా నిలిచిన హరీశ్‌రావు

పీజీ సీటు దక్కినా ఫీజులే అడ్డంకి

క్షణాల్లో స్పందించిన సిద్ధిపేట ఎమ్మెల్యే


సొంత ఇంటిని బ్యాంకులో మార్టిగేజ్ చేసి రుణం మంజూరు

హాస్టల్ ఫీజుల కోసం అదనంగా రూ.లక్ష సాయం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. పీజీ వైద్యవిద్య చదువుతున్న ఓ పేద విద్యార్థినికి రుణం కోసం తన సొంత ఇంటిని బ్యాంకులో తనఖా పెట్టారు. సదరు విద్యార్థినికి రూ. 20 లక్షల ఎడ్యుకేషన్ లోన్ మంజూరు చేయించారు. అంతేకాకుండా అదనంగా హాస్టల్ ఫీజు కోసం రూ.లక్ష సాయం చేశారు.

మిగతా 2లో..



## నిజామాబాద్ జిల్లాలో దొంగనోట్ల కలకలం

- క్రాప్‌లోన్ కట్టేందుకు వెళ్లిన రైతు వద్ద దొంగనోట్లు
- మొన్నటి సర్పంచ్ ఎన్నికల్లో పంచినవిగా అనుమానం
- పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు ప్రారంభం

నిజామాబాద్,(తెలంగాణ ముచ్చట్లు):

బ్యాంక్ రుణం కట్టేందుకు వచ్చిన వ్యక్తి దగ్గర అన్నీ దొంగనోట్లు ఉండడంతో అధికారులు ఖంగుతిన్నారు. వెంటనే పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపండి

**భద్రాద్రి కొత్తగూడెం, (తెలంగాణ ముచ్చట్లు):**

పరిపాలన సౌలభ్యం కోసం ఐదు గ్రామాలను భద్రాచలంలో కలపాలని ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. అలాగే అశ్వరావుపేట పెద్దవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు వినతి చేశారు. ప్రసాద్ స్కీంలో భద్రాచలం రామాలయానికి రెండు వందల కోట్లు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసులు, గిరిజనుల సంక్షేమం కోసం చేసిన ఖర్చులపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క శ్వేతపత్రం విడుదల చేయాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. జాగృతిబాటలో భాగంగా ఆమె జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ పాలనలో ఆదివాసులు, గిరిజనులకు ఏం చేశారో వెల్లడిరచాలన్నారు. సింగరేణి పుట్టినిల్లు ఇల్లందులో కొత్త బొగ్గు బావులు మొదలు పెట్టాలని అన్నారు.

- పెద్దవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలి
- చంద్రబాబుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వినతి

సింగరేణి కార్మికులు సంక్షేమం కోసం కాకుండా సీఎం రేవంత్ ఫుట్ బాల్ కోసం పది కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో కొత్తగూడెంకు ప్రాధాన్యం లేదని విమర్శించారు. ఒక మంత్రి కొత్తగూడెంను దత్తత తీసుకోవాలని.. కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు పెంచాలన్నారు. మణుగూరు ఓసీ 2 ప్రైవేటీకరణ అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లు భద్రాద్రి జిల్లాలో పొలాలకు అందించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రాలో విలీనమైన ఎటపాక పురుషోత్తమ పట్నం, గుండాల, పిచుకులపాడు, కన్నాయిగూడెం గ్రామాలను భద్రాచలంలో కలపాలన్నారు. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి నిధులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. కొత్తగూడెంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. కొత్తగూడెం బైపాస్ రోడ్డు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆదివాసులు, గిరిజనులకు రిజర్వేషన్లు ఉన్నాయని వారిని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. సింగరేణి నిర్వాసిత గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని కవిత డిమాండ్ చేశారు.



# పేద విద్యార్థినీ భవిష్యత్తుకు అండగా నిలిచిన హరీశ్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

వివరాల్లోకి వెళ్తే.... సిద్దిపేటకు చెందిన మమత అనే అమ్మాయికి పీజీ ఎంట్రన్స్ లో సీటు వచ్చినా ట్యూషన్ ఫీజులకు ప్రతీఏటా రూ. 7.50 లక్షలు చెల్లించాలని కళాశాల యాజమాన్యం స్పష్టం చేసింది. బ్యాంకు రుణం కోసం వెళ్లగా ఏదైనా ఆస్తిని తనఖా పెడితేనే రుణం మంజూరు చేస్తామని బ్యాంకర్స్ తెలిపాయి. ఈ నెల 18వ తేదీలోపు ట్యూషన్ ఫీజు చెల్లించి కాలేజీలో చేరకుంటే పీజీ సీటును తిరస్కరించే పరిస్థితి నెలకొంది. ఇదే విషయాన్ని విద్యార్థిని మమత, తండ్రి రామచంద్రం హరీశ్ రావు దృష్టికి తీసుకెళ్లారు. క్షణం ఆలస్యం చేయకుండా సిద్దిపేటలోని తన స్వగృహాన్ని బ్యాంకులో తనఖా పెట్టి రూ. 20 లక్షల ఎడ్యూకేషన్ లోన్ మంజూరు చేయించారు. గతంలో ఆటో కార్మికుల కోసం కూడా ఇదే మాదిరిగా హరీశ్ రావు తన ఇంటిని తనఖా పెట్టారు. వెంటనే స్పందించి... ఎడ్యుకేషన్ లోన్ ఇప్పించే ఏర్పాట్లు చేసిన హరీశ్ రావుకు పలువురు అభినందనలు, కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పీజీ సీటు పోతుందని బాధపడ్డాను : మమత

“మా అమ్మానాన్నలు కష్టపడి టైలరింగ్ చేస్తూ నన్ను ఎంబిబిఎస్ దాకా చదివించారు. అహర్నిశలు శ్రమించి పీజీ ఎంట్రన్స్ లో సీటు దక్కిందని సంతోష పడ్డాను. ఉచితంగానే సీటు వచ్చినా కానీ ప్రతి సంవత్సరం ట్యూషన్ ఫీజు రూ.7.50 లక్షల చొప్పున మూడేళ్లు రూ.22.50 లక్షలు కట్టాలని చెప్పడంతో ఇక సీటు అసాధ్యమని అనుకున్నా” అని విద్యార్థిని మమత చెప్పారు.

“పీజీ చదివే యోగ్యం లేదని బాధపడ్డాను. కానీ అనాడు నాతో పాటు మా చెల్లెళ్ళకు ఎంబీబీఎస్ చదవడానికి హరీష్ రావు సార్ హెల్ప్ చేశారు. కానీ ఇది పెద్ద విషయం కావడంతో సార్ చేస్తారో..లేదో అని టెన్షన్ పడ్డాము . మేము అడగడమే ఆలస్యం.. తన ఇంటిని బ్యాంకులో మార్టిగేజ్ చేసి ఎడ్యుకేషన్ లోన్ ఇప్పిస్తానని వెంటనే బ్యాంకు వారికి కూడా ఫోన్ చేసి చెప్పారు. చదువు విలువ, నిరుపేద విద్యార్థులు పడే ఇబ్బందుల గురించి క్షుణ్ణంగా తెలిసిన హరీష్‌రావు సార్ మన సిద్దిపేట ఎమ్మెల్యే కావడం మనందరి అదృష్టం” అని మమత చెప్పుకొచ్చారు.

తీర్చుకోలేని రుణం : కొంక రామచంద్రం, మమత తండ్రి

“నా బిడ్డ కష్టపడి చదివి ప్రభుత్వ కన్వీనర్ కోటాలో సీటు సంపాదించినప్పటికీ ఆర్థిక స్తోమత లేక ట్యూషన్ ఫీజు కూడా చెల్లించే పరిస్థితి లేదు. మేం చేసిన ప్రయత్నాలకు అన్ని దారులు మూసుకుపోయాయి. కానీ ఆపద వచ్చినవారి కోసం నిరంతరం తన ఇంటి తలుపులు తెరిచి ఉంచే హరీష్ అన్న ఏకంగా తన ఇంటిని మాకోసం తాకట్టు పెడతాడని కలలో కూడా ఊహించలేదు"అని మమత తండ్రి రామచంద్రం తెలిపారు.

"నా నలుగురు బిడ్డలు హరీష్ అన్న స్ఫూర్తితోనే, ఆయన చేసిన సహాయంతోనే ఎంబిబిఎస్ వైద్య విద్య చదువుతున్నారు. పెద్ద బిడ్డ ప్రస్తుతం పీజీ సీటు దక్కించుకోగా.. రెండో అమ్మాయి ఎంబిబిఎస్ హౌస్ సర్జన్ చేస్తున్నది. మరో ఇద్దరు అమ్మాయిలు జగిత్యాలలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని 3 లక్షల మందిలో మేము ఒకరం. అంతే తప్ప మరెలాంటి సంబంధం లేదు. అయినా మా పాప భవిష్యత్తు కోసం ఒక్క క్షణం ఆలోచించకుండా తన ఇంటిని తాకట్టు పెట్టిన హరీష్ అన్న రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేము” అని మమత తండ్రి రామచంద్రం పేర్కొన్నారు.

# పంచాయితీలకు సెలవ్.. పెట్టండి

**రాజన్నసిరిసిల్ల, (తెలంగాణ ముచ్చట్లు):**

పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం సులభం కానీ.. పంచాయతీ ఎన్నికల్లో గెలవడం కష్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ 10 సీట్లు గెలవలేదని.. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ 80 గ్రామాల్లో గెలిచిందని తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సమావేశమైన కేటీఆర్.. వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికలు అయిపోయాయి కాబట్టి.. పగలు, పంచాయితీలో పక్కనబెట్టి కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. సిరిసిల్ల ప్రజలు గులాబీ జెండాను గుండెలను హత్తుకున్నారని కేటీఆర్ అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కొన్ని చోట్ల రెండు వైపులా బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే నిలబడ్డారని తెలిపారు. త్వరలోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగబోతున్నాయని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీకి, మండల పరిషత్‌కు అనుసంధానకర్త ఎంపీటీసీ అని కేటీఆర్ తెలిపారు. అలాగే జిల్లా పరిషత్‌కు, మండల పరిషత్‌కు సమన్వయకర్త జడ్పీటీసీ అని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికలతో పంచాయితీలు పక్కనపెట్టాలని సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఫ్లలెఫ్లలెనా డంపింగ్ యార్డులు, ప్రగతి వనాలు ఏర్పాటు చేశామని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పల్లెలు నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు.సిరిసిల్లలో ఉన్న 57 ఎంపీటీసీ స్థానాలు గెలిచేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అందరూ కలిసి కాంగ్రెస్‌పై కొట్లాడాలన్నారు. గులాబీ గెలుపును చూసి కాంగ్రెస్ పరేషన్ అయితోందని తెలిపారు. ఓడిపోయిన అభ్యర్థులు కూడా ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీచేయాలన్నారు. పాత తరం నాయకులు, కొత్త తరాన్ని కలుపుకుంటూ ముందుకుపోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అప్పటికప్పుడు మాటలు మారుస్తున్నారని కేటీఆర్ అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రేవంత్ రెడ్డి మొదట 66 శాతం సర్పంచ్ స్థానాలు గెలిచామని చెప్పారని తెలిపారు. వెంటనే మాట మార్చి స్థానిక ఎన్నికలతో పార్టీకి సంబంధం లేదంటున్నాడని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి లాగే ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా మాటలు మారుస్తున్నారని అన్నారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరానని కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు మాటమార్చి బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెబుతున్నారని తెలిపారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని పరిస్థితిలో కడియం, పోచారం ఉన్నారని విమర్శించారు. గడ్డిపోచలాంటి పదవి కోసం చూరుకు గబ్బిలాల్లా వేలాడుతున్నారని ఎద్దేవా చేశారు.గెలుపు కోసం కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ప్రజలు మాత్రం బీఆర్ఎస్‌తోనే ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో గులాబీ ప్రభంజనమే అందుకు నిదర్శనమని చెప్పారు. సర్పంచ్ అయినా ఎమ్మెల్యే, ఎంపీలు అయినా ప్రజల కోసమే పనిచేయాలని అన్నారు. ప్రతిపైసా ప్రజల కోసమే ఖర్చు పెట్టాలని సూచించారు. ఐదు అంచెల్లో ప్రభుత్వాన్ని ఎలా నడపాలో అంబేద్కర్ రాజ్యాంగంలో చెప్పారని గుర్తుచేశారు. కేంద్రం పైసలు ఇయ్యకున్నా.. రాష్ట్ర నిధులు ఉంటాయని తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులు ఫైనాన్స్ కమిషన్ నుంచి వస్తాయని పేర్కొన్నారు. దాన్ని ఆపే హక్కు ఎమ్మెల్యేలకు లేదు.. సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఉండదని స్పష్టం చేశారు.

# 41 మంది మావోయిస్టుల లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

పోలీసుల వివరాల ప్రకారం.. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్/కంపెనీ స్థాయి కమిటీ సభ్యులు, 12 మంది ఏరియా/ ప్లాటూన్ కమిటీ సభ్యులు, 23 మంది సాధారణ పార్టీ సభ్యులు ఉన్నారు. ఇన్సాస్ ఎల్ఎంజీ, ఏకే47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ రైఫిళ్లు, .303 రైఫిళ్లు తదితర ఆయుధాలు లొంగుబాటులో భాగంగా అప్పగించారు. మావోయిస్టు పార్టీలో సంస్థాగత బలహీనత, నాయకత్వంపై నమ్మకం తగ్గడం, అడవుల్లో తీవ్ర జీవన కష్టాలు, భద్రతా బలగాల ఒత్తిడి కారణంగానే తాము ప్రధాన జనజీవనంలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు లొంగిపోయిన మావోయిస్టులు

తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుకు స్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి రాష్ట్ర పునరావాస విధానం ప్రకారం డివిజనల్ కమిటీ సభ్యులకు రూ.5 లక్షలు, ఏరియా కమిటీ సభ్యులకు రూ.4 లక్షలు, పార్టీ సభ్యులకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందించనున్నారు. ఆయుధాలపై అదనపు రివార్డు కూడా ఇవ్వనున్నారు. మొత్తంగా రూ.1.46 కోట్లకు పైగా నగదు ప్రోత్సాహకాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ లొంగుబాటుతో తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాలు మరింత బలహీనపడతాయని, మిగిలిన అజ్ఞాత కేడర్లు కూడా హింసను వీడి జనజీవనంలోకి రావాలని పోలీసులు పిలుపునిచ్చారు.నక్సలిజాన్ని రూపుమాపేందుకు,మావోయిస్టులను ఏరివేసేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఎంతోమంది మావోలు భద్రతబలగాల ఎన్ కౌంటర్ లో మృతిచెందారు. మరికొందరు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ క్రమంలో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట 40 మంది మావోయిస్టులు లొంగిపోయారు. డీజీపీ సమక్షంలో జనజీవన స్రవంతిలో మావోయిస్టులు కలిసిపోయారు.. లొంగిపోయిన వాళ్లలో ముగ్గురు రాష్ట్రస్థాయి లీడర్లు.. కొందరు హిడ్మా బెటాలియన్ కమాండర్స్ ఉన్నారు. లొంగిపోయిన వారిలో కామారెడ్డికి చెందిన రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎర్రగొల్ల రవి, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆరుగురు డివిజన్ కమిటీ సభ్యులు, ఇద్దరు తెలంగాణ వాసులు ఉన్నారు. మిగతా మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారిగా డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు. మావోయిస్టుల వద్ద నుంచి 24 తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు సెంట్రల్ విజన్ కమాండర్లు ఉన్నట్లు డీజీపీ వెల్లడిరచారు. తెలంగాణ పోలీసుల మేజర్ ఆపరేషన్ సక్సెస్‌తో మావోయిస్ట్ పార్టీ కి మరో ఎదురు దెబ్బ తగిలినట్లైంది.




# ఫోన్ ట్యాపింగ్ కేసు.. ప్రభాకర్ రావు కస్టోడియల్ పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

అయితే ట్యాపింగ్ కేసులో మరికొన్ని రోజులు విచారణ చేయాలని సుప్రీంకోర్టును సిట్ కోరింది. వారం రోజుల కస్టోడియల్ విచారణ రిపోర్ట్‌ను ఉన్నత న్యాయస్థానానికి సిట్ అందజేసింది. దీంతో ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణను వారం రోజుల పాటు పొడిగింపుకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. డిసెంబర్ 26న పోలీస్ కస్టడీ నుంచి ప్రభాకర్ రావును విడుదల చేయాలని.. తదుపరి విచారణ వరకు ఎలాంటి వ్యతిరేక చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. పోలీసుల దర్యాప్తుకు సహకరించాలని ప్రభాకర్ రావును సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేకాకుండా ఇంటి నుంచి ఆహారం తెచ్చుకునేందుకు, అవసరమైన మందులు తీసుకునేందుకు ప్రభాకర్ రావుకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. కాగా.. కొత్త సిట్ ఏర్పాటుతో ట్యాపింగ్ కేసు మరింత వేగవంతంగా విచారణ జరిగే అవకాశం ఉంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగనుంది.

కొత్తగా ఏర్పాటు చేసిన సిట్‌లో 9 మంది అధికారులు ఉన్నారు. సీపీ సజ్జనార్‌తో పాటు రామగుండం సీపీ అంబరి కిషోర్ జా కూడా సిట్‌లో ఉన్నారు. గతంలో వెస్ట్ జోన్ డీసీపీగా ఉన్న సమయంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో సిద్ధిపేట సీపీ విజయ్ కుమార్ కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. మాదాపూర్ డీసీపీ రితి రాజ్, మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డితో పాటు రవీందర్, వెంకట గిరి, కేఎస్ రావు, శ్రీధర్, నాగేందర్ రావుతో కొత్త సిట్ ఏర్పాటు అయ్యింది.

# ఐటి ఉద్యోగులే టార్గెట్‌గా గంజాయి సరఫరా

(మొదటి పేజీ తరువాయి)

తాజాగా నగరంలోని రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐటీ ఉద్యోగులే టార్గెట్‌గా గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు.. గంజాయి సరఫరా చేస్తున్న సోహెల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుని వద్ద నుంచి 17 కేజీల గంజాయి, 2 గ్రాముల ఎండీఎంఏ (ఓఆఓం) డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి గంజాయి తెచ్చి ఐటీ ఉద్యోగులకు నిందితుడు సోహెల్ సరఫరా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో బయటపడిరది. సోహెల్‌తో పాటు గంజాయి వినియోగించిన ఐదు మంది కన్స్యూమర్లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన రాయదుర్గం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# నిజామాబాద్ జిల్లాలో దొంగనోట్ల కలకలం

(మొదటి పేజీ తరువాయి)

బ్యాంకులో పంట రుణం చెల్లించేందుకు తీసుకొచ్చిన నగదు పూర్తిగా దొంగ నోట్లుగా బ్యాంకు అధికారులు గుర్తించారు. రైతు తీసుకొచ్చిన రూ. 2,08,500 లలో అన్నీ రూ.500 నోట్లు నకిలీగా తేల్చారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బ్యాంకు అధికారులు వర్ని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ జిల్లాలోని జలాల్పూర్ గ్రామానికి చెందిన రైతు నరెడ్ల చిన్నసాయిలు పంట రుణం చెల్లించేందుకు గురువారం సాయంత్రం వర్ని మండల కేంద్రంలోని కెనరా బ్యాంకుకు రూ. 2,08,500 తీసుకొచ్చాడు. ఈ క్రమంలో నగదును చెల్లించేందుకు క్యాష్ కౌంటర్‌లో ఇచ్చాడు. క్యాష్ కౌంటింగ్ యంత్రంలో నోట్లను లెక్కిస్తుండగా నకిలీ నోట్లు వచ్చాయి. అప్రమత్తమైన బ్యాంకు అధికారులు, సిబ్బంది డబ్బు ఎక్కడి నుంచి తెచ్చావని రైతును ప్రశ్నించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. రైతు తీసుకొచ్చిన రూ. 500 నోట్లను బ్యాంకు సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించగా.. అవన్నీ నకిలీ నోట్లేనని గుర్తించారు. నాలుగు రూ.500 నోట్ల కట్టలపై ఒక్కొక్క కట్టపై ఒకేరకమైన క్రమసంఖ్య ఉండటాన్ని గుర్తించారు. దీంతో నకిలీనోట్లని నిర్ధరించి గురువారం రాత్రి వర్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు అధికారి పంకజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నకిలీ నోట్ల వ్యవహారం వర్ని మండలంలో కలకలం సృష్టించింది. పరారీలో ఉన్న రైతు కోసం పోలీసులు గాలిస్తున్నారు. అయితే ఇదంతా మొన్నటి పంచాయితీ ఎన్నికల్లో పంచిన డబ్బుగా చర్చిస్త్‌ఆరు. ఈజీగా డబ్బు సంపాదించేందుకు కొందరు కేటుగాళ్లు నకిలీ నోట్ల ప్రింటింగ్ కు పాల్పడుతున్నారు. దొంగనోట్లను ముద్రించి గుట్టుచప్పుడు కాకుండా చలామణిలోకి తీసుకొస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల్లో జోరుగా దొంగ నోట్ల చలామణి అయినట్లు అధికారులు గుర్తించారు. రంగంలోకి దిగిన పోలీసులు విచారణ చేపట్టారు. 417 రూ.500 నోట్లు నకిలీగా పోలీసులు తేల్చారు. కాగా ఇవే నోట్లను ఓ అభ్యర్థి సర్పంచ్ ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేసినట్లు తేలడంతో గ్రామస్థులు లబోదిబో మంటున్నారు. ఓటు వేసేందుకు నోటు తీసుకున్న వారిలో గుబులు మొదలైంది. స్థానిక ఎన్నికల్లో దొంగనోట్లు చలామణి కావడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

# వికారాబాద్ జిల్లాలో దారుణం

- కట్టుకున్న భర్తే కాలయముడయ్యాడు
- దుడ్డుకర్రతో కొట్టి చంపిన దుండగుడు

**వికారాబాద్,(తెలంగాణ ముచ్చట్లు):**

వికారాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. ప్రేమించి పెళ్లాడిన వాడే ఆమె పాలిట కాలయముడయ్యాడు. పెళ్లయినప్పటి నుంచి అదనపు కట్నం కోసం చిత్రవధలకు గురిచేశాడు. చివరకు విచక్షణారహితంగా కొట్టి చంపేశాడు. ఈ దారుణ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. తాజాగా ఈ కిరాతకానికి సంబంధించిన వీడియో బయటకొచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని సాయిపూర్‌కు చెందిన పరమేశ్, అనూష (22) ప్రేమించుకున్నారు. పరమేశ్ పట్టు బట్టడంతో అతని తల్లిదండ్రులకు ఇష్టం లేకపోయినా సరే, 8 నెలల క్రితం పెళ్లి జరిపించారు. ప్రేమించి పెళ్లాడిన వ్యక్తితో సంతోషంగా గడపొచ్చని భర్తతో మెట్టింటికి అడుగుపెట్టిన అనూషకు నిరాశే ఎదురైంది. అత్తమామలతో పాటు భర్త నుంచి వరకట్న వేధింపులు మొదలయ్యాయి. కొద్దిరోజులుగా కట్నం కోసం వారు వేధింపులకు గురిచేశారు. వారం రోజుల క్రితం విచక్షణారహితంగా కొట్టారు. ఈ విషయం తెలిసిన అనూష తల్లి, సోదరుడి వరసయ్యే వ్యక్తి వచ్చి ఆమెను పుట్టింటికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయితే అనూషను మంచిగా చూసుకుంటానని చెప్పిన పరమేశ్.. గురువారం నాడు ఆమెను తీసుకుని ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత మరోసారి అనూషతో గొడవపడ్డాడు. ఆమెను తీవ్రంగా కొట్టాడు. దీంతో అనూష అపస్మారక స్థితిలోకి చేరుకుంది. ఇది గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అనూష మృతిచెందింది. బాధితురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అనూషను పరమేశ్ ఇంటి బయట విచక్షణారహితంగా కొట్టడం అక్కడే సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

# సర్పంచ్ ఎన్నికలతోనే కాంగ్రెస్ పతనం ప్రారంభం.!





- బిఆర్ఎస్ సర్పంచులకు ప్రజలు అండగా నిలిచారు.
- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య.

**సత్తుపల్లి, డిసెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజావ్యతిరేక పాలనతో విసిగిపోయిన గ్రామీణ ప్రజలు సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పారని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. బిఆర్ఎస్ పార్టీకి అఖండ మద్దతు తెలుపుతూ అపూర్వ విజయాన్ని అందించిన సత్తుపల్లి నియోజకవర్గ గ్రామీణ ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి తమ గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. అధికార పార్టీ నుంచి ఎలాంటి వేధింపులు ఎదురైనా బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు అండగా నిలబడి పోరాడేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాలతోనే కాంగ్రెస్ పార్టీ పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించిన సండ్ర వెంకట వీరయ్య, రానున్న జడ్పిటిసి, ఎంపిటిసి, మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా ప్రజావ్యతిరేక కాంగ్రెస్ పార్టీకి తప్పక ఓటమి తప్పదని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీకి అఖండ విజయాన్ని అందించిన ప్రతి గ్రామీణ ఓటర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు పెట్టిన నమ్మకానికి తగినట్లుగానే బిఆర్ఎస్ పార్టీ సర్పంచుల పనితీరు ఉంటుందని ఆయన తెలిపారు.
ఈ సందర్భంగా తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీర మోహన్ రెడ్డి నివాసంలో నూతనంగా ఎన్నికైన బిఆర్ఎస్ సర్పంచులు, వార్డు సభ్యులతో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సమావేశమై వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 250 గజాల ఇంటి స్థలం హామీ అమలు చేయాలి

- మంత్రి పొంగులేటిని కలిసిన తెలంగాణ ఉద్యమకారులు



**హైదరాబాద్,డిసెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి నేతృత్వంలో ఉద్యమకారులు మంత్రి పొంగులేటిని కలిసి విజ్ఞప్తి చేశారు.
ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జైలుకు వెళ్లినవారు మాత్రమే కాకుండా, జైలుకు వెళ్లకపోయినా ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి 250 గజాల ఇంటి స్థలం కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమంలో పాల్గొన్నప్పటికీ కేసులు నమోదు కాకపోవడం వల్ల పలువురు ఇప్పటివరకు గుర్తింపుకు నోచుకోలేదని, అలాంటి వారిని కూడా లబ్ధిదారులుగా గుర్తించాలని కోరారు.
250 గజాల ఇంటి స్థలాల కేటాయింపుకు ప్రత్యేకంగా మంత్రివర్గ ఉపసంఘ కమిటీని ఏర్పాటు చేసి, స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వాలు ఉద్యమకారులను గుర్తించడంలో విఫలమయ్యాయని, దాని వల్ల అనేక మంది ఉద్యమకారులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఉద్యమ కాలంలో ఎదురైన కష్టాల కారణంగా పలువురికి ఆరోగ్య సమస్యలు వచ్చి, ఉపాధి అవకాశాలు కోల్పోయిన పరిస్థితి ఉందని, అలాంటి వారందరినీ గుర్తించి ఇంటి స్థలంతో పాటు ఉద్యమకారులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని కోరారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి ఉద్యమకారులను కలుస్తామని పిడమర్తి రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర సమన్వయకర్తలు డాక్టర్ బొమ్మెర స్టాలిన్, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్‌తో పాటు ఉద్యమకారులు నక్క మహేష్, జోగు గణేష్, మీసాల మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వెన్నుపోటు రాజకీయాల వల్లే పార్టీకి నష్టం

- ఏఐసీసీ, పీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేస్తా
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



**వనపర్తి,డిసెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల వెన్నుపోటు రాజకీయాల వల్ల పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు తీవ్ర నష్టం వాటిల్లిందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని నందీహిల్స్‌లో తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.వనపర్తి నియోజకవర్గ పరిధిలోని 140 గ్రామపంచాయతీ స్థానాలకు ఇటీవల జరిగిన సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజలు తమ సంతృప్తిని ఓటు రూపంలో వెల్లడించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపిన అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు, ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు .ఈ ఎన్నికల్లో 51 శాతం బీసీలకు అవకాశం కల్పించామని, అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ ఓటు శాతం 35.09 శాతం పెరిగిందని వెల్లడించారు. బీఆర్ఎస్‌కు వచ్చిన 51 గ్రామపంచాయతీ స్థానాల్లో కనీసం 15 నుంచి 20 స్థానాలు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉన్న అభ్యర్థులే గెలిచే అవకాశముందని, అయితే కొంతమంది సీనియర్ నాయకుల వెన్నుపోటు రాజకీయాల కారణంగా పార్టీ కార్యకర్తలకు నష్టం జరిగిందని ఆరోపించారు.ఈ వ్యవహారంపై ఏఐసీసీ, పీసీసీ క్రమశిక్షణ కమిటీలకు, హైకమాండ్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తానని మేఘా రెడ్డి స్పష్టం చేశారు. తనపై లేదా నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిపై వ్యక్తిగత అసంతృప్తి ఉంటే ప్రత్యక్షంగా తేల్చుకోవాలని, కానీ పార్టీకి విధేయులుగా పనిచేసే కార్యకర్తలను లక్ష్యంగా చేసుకోవడం అన్యాయమని ప్రశ్నించారు. సీనియర్ నాయకులమని చెప్పుకుంటూ పార్టీకి ద్రోహం చేసే వారి తీరును కాంగ్రెస్ పార్టీ మేధావులు, ప్రజలు గమనిస్తున్నారని, దీనిపై సదరు నాయకులు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, పీసీసీ సభ్యులు శంకర్ ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుల నిర్మూలనకు వ్యవస్థ మార్పే మార్గం
# స్ఫూర్తి గ్రూప్ చర్చా కార్యక్రమం

- మనువాదం ప్రభావానికి వ్యతిరేకంగా ప్రజల పోరాటం అవసరం – వక్తల పిలుపు



**ఏ ఎస్ రావు నగర్, డిసెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం-స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కుల నిర్మూలన అంశంపై చర్చా కార్యక్రమం శుక్రవారం కమలానగర్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు.చర్చను ప్రారంభించిన గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ భారతదేశంలో కుల వ్యవస్థ అంతర్లీనంగా వేళ్లూనుకుపోయిందని, సనాతన మతం నుంచి నేటి హిందూ మతం వరకు నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ ప్రాతిపదికగానే కొనసాగుతోందన్నారు. దీనికి మను ధర్మమే ప్రధాన ఆధారమై బ్రాహ్మణీయ భావజాలంతో శూద్రులను బానిసలుగా మలిచేందుకు దేవుడు, మతాన్ని వినియోగించుకున్నారని విమర్శించారు. నేటి సమాజంలో కులవృత్తులు తగ్గినప్పటికీ మనువాద ప్రభావం కొనసాగుతుండటంతో కుల వ్యవస్థ మరింత ఘనీభవిస్తోందన్నారు. పాలకులు మనువాదాన్ని రాజ్యాంగంగా మలచే ప్రయత్నాలు చేస్తున్నారని, వాటికి వ్యతిరేకంగా పోరాటం అవసరమని పిలుపునిచ్చారు.
శివన్నారాయణ మాట్లాడుతూ పూర్తిగా వ్యవస్థ మార్పు జరగకుండా కుల నిర్మూలన సాధ్యం కాదని, వ్యవస్థ మార్పుకోసం సమిష్టి పోరాటం చేయాలన్నారు. ఎం.భాస్కర్ రావు కుల వ్యవస్థకు మూలం బ్రాహ్మణీయ భావజాలమేనని, అది చేసిన అకృత్యాలను ప్రజలే తిప్పికొట్టాల్సిన బాధ్యత ఉందన్నారు. నేటి సమాజంలో కుల దురహంకారాలు హత్యల దశకు చేరాయని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ సమాజ పరిణామక్రమాన్ని అర్థం చేసుకోవడానికి మార్క్సిస్ట్ విశ్లేషణ అవసరమని చెప్పారు. పురాతన కాలంలో కులాలు వర్గ ప్రాతిపదికన పనిచేశాయని, నేటి సమాజ పురోభివృద్ధికి కుల వ్యవస్థ ప్రధాన ఆటంకమని పేర్కొన్నారు. కుల నిర్మూలనకు సమసమాజ నిర్మాణమే ఏకైక మార్గమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏకే దుర్గాచార్యులు, రుక్కయ్య, మల్లేశం, పుష్ప రాజ్ తదితరులు ప్రసంగించారు. అనంతరం సభ్యులందరూ కుల నిర్మూలన కోసం తమ వంతు కృషి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, గౌసియా, దువా కిరటి, శివన్నారాయణ, మల్లేశం, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కాప్రా డివిజన్‌లో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా విద్యార్థుల ర్యాలీ



- కూచిపూడి నృత్యం, గీతాలతో చెత్త రహితంపై అవగాహన

**కాప్రా, డిసెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా డివిజన్ నోబుల్ స్కూల్ విద్యార్థిని-విద్యార్థులచే శుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. చెత్త ఎక్కువగా పడే మసీదు ఎదురుగా ఉన్న జివిపి పాయింట్ వద్ద కూచిపూడి సాంస్కృతిక కార్యక్రమం, స్వచ్ఛతపై పాటల ప్రదర్శన నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు.ఈ సందర్భంగా విద్యార్థులు చెత్తను రోడ్లపై పడవేయకుండా మున్సిపల్ శానిటేషన్ ఆటోలకు అప్పగించాలని, ప్లాస్టిక్ కవర్లు మరియు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థిని-విద్యార్థులు, పాఠశాల అధ్యాపకులు, జవహర్ నగర్ పోలీస్ శాఖ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అద్భుతమైన నృత్య ప్రదర్శన ఇచ్చిన బేబీ ప్రవళికీని సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్ శాలువాతో పాటు పారితోషికం అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జవాన్ రామకృష్ణ, ఎస్ఎఫ్ఏ కుమార్, వసంత, అంజలి తదితరులు పాల్గొన్నారు.

# వేముల ఘటనపై అడ్డాకులలో అఖిలపక్ష నిరసన



- నిందితులను వెంటనే చట్టపరంగా శిక్షించాలి
- అఖిలపక్ష నాయకుల డిమాండ్

**అడ్డాకుల డిసెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** మహబూబ్నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల గ్రామంలో ఎన్నికల ఫలితాల అనంతరం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ సందర్భంగా దళిత యువతి మాల ప్రవళికపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనను ఖండిస్తూ అడ్డాకుల మండల కేంద్రంలో అఖిలపక్ష పార్టీలు, వివిధ సంఘాలు నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ నిరసన కార్యక్రమాన్ని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మునుగల నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ, దళిత సంఘాలు ఎంఆర్‌పీఎస్, మాల మహానాడు, అలాగే బహుజన సమాజ పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బహుజన సమాజ పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ.. నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటన అగ్రకుల యువతికి జరిగితే ప్రభుత్వ స్పందన ఎలా ఉండేదో ప్రజలు ఆలోచించాలని, దళిత యువతిపై జరిగిన ఈ దాడి విషయంలో ప్రభుత్వ వైఖరి బాధాకరంగా ఉందని అన్నారు. ఇప్పటివరకు ఉత్తర భారత ప్రాంతాల్లో మాత్రమే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని పత్రికల్లో చదివేవారమని, కానీ మనకు సమీప గ్రామంలోనే ఇలాంటి దారుణం జరగడం అత్యంత కలచివేసిందని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.అనంతరం ఎస్ఎఫ్ఐ మండల నాయకుడు ఆంజనేయులు మాట్లాడుతూ నిందితులను వెంటనే శిక్షించి, భవిష్యత్తులో ఇలాంటి చర్యలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రస్థాయి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.మాల మహానాడు మండల అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులు తక్షణమే ఆగాలని, నిందితులకు అత్యంత కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. దళితులపై వివక్ష, దాడులు ఎంతకాలం కొనసాగుతాయో ప్రభుత్వమే సమాధానం చెప్పాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మునుగల నరేష్, మండల కార్యదర్శి మచ్చానీ ప్రశాంత్, నాయకులు స్టీఫెన్, సురేష్, బుజ్జి, ప్రేమ్ కుమార్, బహుజన సమాజ పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్, నాయకుడు నరాసింహ, మాల మహానాడు మండల అధ్యక్షుడు రాఘవేంద్ర, సభ్యులు లక్ష్మీనారాయణ, నరేందర్, ప్రకాశ్, నరేష్, సమాచార హక్కు చట్టం మండల అధ్యక్షుడు పాతిరి నాగవర్ధన్, అలాగే ఖాజా మొయినుద్దీన్, నిరంజన్, రేవంత్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# వేముల ఘటనను తీవ్రంగా ఖండించిన దళిత జర్నలిస్టు బండి రాజు



**మహబూబ్ నగర్,డిసెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** మహబూబ్నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల గ్రామంలో దళిత యువతి మాల ప్రవళికపై జరిగిన అత్యాచారం, హత్య ఘటన అత్యంత అమానుషమని దళిత జర్నలిస్టు బండి రాజు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన సమాజాన్ని తలదించుకునేలా చేసిందని, ముఖ్యంగా దళిత మహిళల భద్రతపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.నిందితులను వెంటనే అరెస్టు చేసి అత్యంత కఠిన శిక్ష విధించాలని దళిత జర్నలిస్టుల తరుపున బండి రాజు డిమాండ్ చేశారు. దళితులపై జరుగుతున్న ఇలాంటి దాడుల విషయంలో ప్రభుత్వ వైఖరి నిర్లక్ష్యంగా ఉందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఇలాంటి ఘటనలు మళ్లీ మళ్లీ జరుగుతాయని హెచ్చరించారు.దళిత మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ ఘటనపై దళిత జర్నలిస్టులంతా తీవ్ర ఆవేదనతో ఉన్నారని, దళితులపై జరుగుతున్న దాడులపై నిరంతరం పోరాటం చేస్తామని బండి రాజు స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# పదవి ఒక వరం.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

**సర్పంచులకు మంత్రి తుమ్మల సూచన**

**సత్తుపల్లి, డిసెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల విశ్వాసంతో లభించిన పదవి ఒక వరమని, ఆ నమ్మకానికి అనుగుణంగా పనిచేసినప్పుడే ప్రజల మన్ననలు లభిస్తాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గ్రామాల అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడకుండా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సర్పంచులకు సూచించారు.

సత్తుపల్లి మండల పరిధిలోని పాకలగూడెం గ్రామంలో తన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన సర్పంచుల అభినందన కార్యక్రమంలో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్ అభ్యర్థులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు, సహాయ సహకారాలు ప్రభుత్వపరంగా పూర్తిగా అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. తనకు రాజకీయ జన్మనిచ్చిన సత్తుపల్లి నియోజకవర్గం అభివృద్ధిలో ముందుండటమే తన ఆకాంక్షగా పేర్కొన్నారు. ప్రజల మన్నన పొందిన నాయకులకే రాజకీయాల్లో సుదీర్ఘ భవిష్యత్తు ఉంటుందని, అభివృద్ధి కార్యక్రమాల అమలులో నిజాయితీతో పాటు పారదర్శకత తప్పనిసరిగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్‌తో పాటు సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, తుమ్మల అభిమానులు పాల్గొన్నారు.





# దమ్మాయిగూడలో ఉచిత వైద్య శిబిరం

**దమ్మాయిగూడ, డిసెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** కీసర మండలం దమ్మాయిగూడ మున్సిపాలిటీ లో వెంకటేశ్వర నగర్ కాలనీలో (సౌత్ కమలానగర్) పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్, నవోదయ సంక్షేమ వేదిక మరియు సీఐటీయూ కీసర మండల కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని దమ్మాయిగూడ మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్ప రామారావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, కార్మికుల కోసం సీఐటీయూ చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ట్రస్ట్ మరియు సంక్షేమ వేదిక ద్వారా ఇలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, సామాజిక సేవా కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. పేదలు నివసించే ప్రాంతాల్లో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించి మందుల పంపిణీ చేయడం, అవసరమైన వారికి కాటరాక్ట్ ఆపరేషన్లు చేయించడం, కంటి అద్దాలను సరసమైన ధరలకు అందించడం గొప్ప కార్యక్రమమని అన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సీఐటీయూ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించి, తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. మేడ్చల్ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షురాలు ఈగ శ్వేతా రాజు బ్రెస్ట్ క్యాన్సర్ స్కానింగ్ మెడికల్ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోగ్య సమస్యల్లో బ్రెస్ట్ క్యాన్సర్ ఒకటని, దీనిని ఆదిలోనే గుర్తించి నివారించేందుకు చేస్తున్న కృషికి ధన్యవాదాలు తెలిపారు.కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరెడ్డి, ఈగ రాజు ముదిరాజ్ మాట్లాడుతూ సీఐటీయూ చేపట్టే సేవా కార్యక్రమాలకు తమ వంతు చేయూత అందిస్తామని తెలిపారు.ఈ వైద్య శిబిరంలో కమలానగర్ ప్లానెట్ ఆప్టికల్స్ వైద్యులు కంటి పరీక్షలు, సాకేత్ & దమ్మాయిగూడ పద్మసాయి డెంటల్ క్లినిక్స్‌కు చెందిన డాక్టర్ నిమిలే దినేష్ దంత పరీక్షలు, నాగారం 'దియా' స్కిన్ & హెయిర్ క్లినిక్ వైద్యులు చర్మ పరీక్షలు, సియాన్ క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్యులు బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు.





# వాసవి మిత్ర మండలి ఆధ్వర్యంలో అమావాస్య అన్నదానం

**కాప్రా, డిసెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** వాసవి మిత్ర మండలి మేడ్చల్ -మల్కాజ్గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య రోజున నిర్వహించే అన్నదాన కార్యక్రమం శుక్రవారం ఈసీఐఎల్ చౌరస్తాలోని సాయిబాబా దేవాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల కుషాయిగూడకు చెందిన పేద వృద్ధులకు ఆర్థిక సహాయం అందజేశారు. మాలే వరమ్మ, కొండూరి విజయ, తోడుపునూరి ఉమారాణి, పడకంటి కమలమ్మలకు చెరో రూ.1,000 చొప్పున పింఛన్ అందించారు .ఈ కార్యక్రమంలో వాసవి మిత్ర మండలి అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి రాముని తిరుమలేష్ గుప్త, కార్యనిర్వాహక కార్యదర్శి గంప కృష్ణ గుప్త, ఉపాధ్యక్షులు నంగునూరి అశోక్ గుప్త, చెన్న చక్రపాణి గుప్త, తాటి శ్రీనివాస్ గుప్త, వైవియూ నాగేశ్వరరావు గుప్తతో పాటు పలువురు కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.అమావాస్య రోజున అన్నదానం, సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# కార్పొరేటర్ బొంతు శ్రీదేవి దిష్టిబొమ్మ దహనం

**చర్లపల్లి, డిసెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** జీహెచ్ఎంసీ 16వ డివిజన్ అంశంలో చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అవలంబిస్తున్న వైఖరిని నిరసిస్తూ శుక్రవారం చక్రిపురం సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆమె దిష్టిబొమ్మను దహనం చేశారు. చక్రిపురంలోని తెలంగాణ తల్లి విగ్రహం సాక్షిగా చక్రిపురం కాలనీతో పాటు పరిసర కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. 16వ డివిజన్ ఏర్పాటులో కార్పొరేటర్ కుట్రపూరిత రాజకీయాలు చేస్తోందని, ప్రజల



ఆకాంక్షలను పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు.ఈ నిరసన కార్యక్రమంలో చక్రిపురం కాలనీ అధ్యక్షులు గడ్డల పాండు, ప్రధాన కార్యదర్శి సోమసాని అశోక్, గౌరవ అధ్యక్షులు మొగిలి రాఘవరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు సహదేవ్ గౌడ్, లక్ష్మీ ప్రైడ్ అధ్యక్షులు ఆర్. సుధాకర్ రెడ్డి, టీచర్స్ కాలనీ మాజీ అధ్యక్షులు నరసింహ గౌడ్, మారుతి కాలనీ గౌరవ అధ్యక్షులు మహేందర్, రమణ సీతారామ కాలనీ ఉపాధ్యక్షులు బోళ్ళ శ్రీనివాస్, సాయి కృష్ణ కాలనీ మురళి, మధుర నగర్ ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, రమణ, చక్రిపురం ఉపాధ్యక్షులు డి.ఎం. కొండారెడ్డి, పి. భాస్కర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, యాకయ్య, ఎర్రయ్య, చంద్రారెడ్డి, బుచ్చిరెడ్డి, ఆంజనేయులు, వెంకట్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, మాన్ సింగ్, రంజిత్ రెడ్డి, ముఖేష్ నాయక్, రమణ, బీజేపీ సీనియర్ నాయకులు, కాంటెస్టెడ్ కౌన్సిలర్ టి.వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధాల పునాదులపై ఉన్న కాంగ్రెస్ కూలడం ఖాయం



- స్థానిక సంస్థల ఎన్నికల్లో నిశ్శబ్ద విప్లవం
- గట్టు యాదవ్ జిల్లా అధ్యక్షులు

**వనపర్తి,డిసెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి స్వగృహంలో శుక్రవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేని, ఆచరణకు అసాధ్యమైన 420 హామీలు, ఆరు గ్యారంటీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. వాటిని అమలు చేయడంలో విఫలమై ప్రజల తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోందని అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు నిశ్శబ్ద విప్లవం ద్వారా బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు మద్దతు తెలిపారని చెప్పారు. ఈ ఫలితాలను తట్టుకోలేని కొంతమంది ఎమ్మెల్యేలు అసహనంతో ప్రజాస్వామ్యానికి భంగం కలిగించేలా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. 59 మంది సర్పంచులను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

**రేవంత్ రెడ్డిది ప్రచార ఆర్భాటమే**
**వాకిటి శ్రీధర్, జిల్లా అధికార ప్రతినిధి**

ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి తన ప్రచార ఆర్భాటం కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. అందాల పోటీలు, తెలంగాణ సమ్మిట్, ఢిల్లీ పర్యటనలు, ప్రజాపాలన ప్రచారం, ఫుట్‌బాల్ స్టేడియం వంటి కార్యక్రమాలకు సుమారు మూడు వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేసి సంక్షేమ పథకాలను బంద్ పెట్టారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో 135 గ్రామ పంచాయతీలలో 122 పంచాయతీలు గెలిచి ప్రజల హృదయాల్లో నిలిచామని, రేవంత్ పాలన వైఫల్యం కారణంగానే ఇప్పుడు 50 శాతానికి పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. ప్రజలు కేసీఆర్ సుస్థిర పాలనను, నిరంజన్ రెడ్డి ప్రజాపాలనను కోరుకుంటున్నారని అన్నారు.

**క్యాంపు కార్యాలయం అబ్బ సొత్తు కాదు**
**కృష్ణా నాయక్, మాజీ ఎంపీపీ**

మాజీ ఎంపీపీ కృష్ణా నాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎన్ని అరాచకాలు, ప్రలోభాలు, దౌర్జన్యాలకు పాల్పడినా ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలబడి 59 మంది సర్పంచులను గెలిపించారని అన్నారు. నిరంజన్ రెడ్డి నిర్మించిన క్యాంపు కార్యాలయంలో ఉంటూ బీఆర్ఎస్ సర్పంచులను గేటు తొక్కనీయమని మాట్లాడటం అహంకారమని, అలాంటి తీరుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఘనపురం మండలానికి తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2500, వృద్ధులకు రూ.4000, వికలాంగులకు రూ.6000, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యా భరోసా, విద్యార్థినులకు స్కూటీలు, ధాన్యానికి బోనస్, గ్యాస్ సబ్సిడీ, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు బీమా వంటి హామీలు అమలు చేసిన తర్వాతే మాట్లాడాలని డిమాండ్ చేశారు. రెండేళ్లలో ఎమ్మెల్యే ఏమి చేయలేదని, మిగిలిన మూడేళ్లలో కూడా చేయలేరని ప్రజలు గుర్తించారని, ఇప్పటికైనా ప్రతిపక్షాలను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు.ఈ సమావేశంలో జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, పెబ్బేరు మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రి స్వామి, నాయకులు రాళ్ల కృష్ణయ్య, ఎద్దుల సాయి కుమార్, స్టార్ రహీమ్, జోహెబ్ హుస్సేన్, చిట్యాల రాము, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లు కలెక్టర్ కార్యాలయం దగ్గర 5వ రోజు రిలే నిరాహార దీక్ష



- పెండింగ్ లేప్రసి సర్వే బిల్లులు వెంటనే చెల్లించాలి : ఆశా వర్కర్లు డిమాండ్

**మేడ్చల్–మల్కాజిగిరి, డిసెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఐదు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న లేప్రసి సర్వే బిల్లులు వెంటనే చెల్లించాలని, పారితోషికం లేని పని చేయబోమని డిమాండ్ చేస్తూ బాలానగర్ పీహెచ్‌సీలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష ఐదో రోజుకు చేరుకుంది.శుక్రవారం రోజు నిర్వహించిన ఐదవ రోజు రిలే నిరాహార దీక్షను యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ పద్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేవతి కళ్యాణి మాట్లాడుతూ, ప్రస్తుత లేప్రసి సర్వేకు సంబంధించిన బిల్లులు, గత ఐదు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులకు ప్రభుత్వం ఇప్పటికీ బడ్జెట్ విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ ఎప్పుడు విడుదల అవుతుందనే స్పష్టత కూడా లేకపోవడం వల్ల ఆశా వర్కర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.పెండింగ్ లేప్రసి సర్వే బిల్లులు, ఇతర అన్ని బిల్లులు వెంటనే చెల్లించాలని, ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం రూ.18,000 ఇవ్వాలని, బాలానగర్ పీహెచ్‌సీలో పనిచేస్తున్న 7 మంది ఆశా వర్కర్లకు అక్టోబర్ నెల జీతాన్ని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆన్లైన్ పనుల పేరిట జరుగుతున్న వేధింపులు ఆపాలని, దుర్భాషలాడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. ఉన్నికృష్ణ మాట్లాడుతూ, డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకు లేప్రసి సర్వే పనులను నిలిపివేయాలని ఆశా వర్కర్లకు పిలుపునిచ్చారు. సంవత్సరాల తరబడి సర్వేలు చేయించుకుని బిల్లులు చెల్లించకపోవడం అన్యాయమని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులు చెల్లించే వరకు ఎల్సీడీసీ సర్వే చేయబోమని యూనియన్ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.డిసెంబర్ 23న జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించాలని, డిసెంబర్ 27న కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని ఆశా వర్కర్లకు యూనియన్ పిలుపునిచ్చింది.

# 80వ వార్షికోత్సవ మహాసభను విజయవంతం చేయాలి

**టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరేందర్ నాయక్ పిలుపు**



**వరంగల్,డిసెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** ఉపాధ్యాయులు కేవలం ఉద్యోగులు మాత్రమే కాక సమాజ నిర్మాణానికి పునాది వేసే శిల్పులని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సమాఖ్య రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరేందర్ నాయక్ అన్నారు. టీఆర్‌టీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించనున్న 80వ వార్షికోత్సవ అభ్యుదయోత్సవ మహాసభను ఉపాధ్యాయులంతా విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.1944లో తూర్పు గోదావరి జిల్లా తాపేశ్వరంలో ఆంధ్ర రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్యగా ప్రారంభమైన ఉపాధ్యాయ ఉద్యమం, చెన్నుపాటి లక్ష్మయ్య నాయకత్వంలో 1947లో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్‌గా పునర్వ్యవస్థీకరించబడి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా విస్తరించిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2014 జూన్ 2న చారిత్రక మలుపు తిరిగిందని, దివంగత మార్పుబాలకృష్ణమ్మ ప్రేరణ, త్యాగం, అహర్నిశల కృషి ఫలితంగా తెలంగాణలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సమాఖ్యగా, ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్‌గా సంఘం విభజింపబడిందని తెలిపారు.

గత 80 సంవత్సరాలుగా ఈ సంఘం ఉపాధ్యాయుల గౌరవం కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, విద్యార్థుల భవిష్యత్తు కోసం అవిరామంగా పోరాటం చేస్తోందని నరేందర్ నాయక్ పేర్కొన్నారు. ప్రస్తుతం మానేటి ప్రతాపరెడ్డి, కటుకం రమేష్, మారెడ్డి అంజిరెడ్డి, సుంకెశీల ప్రభాకర్ రావు నాయకత్వంలో మరోసారి ఉపాధ్యాయ సంఘటిత శక్తిని చాటే సమయం వచ్చిందన్నారు.

టీఆర్‌టీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే అభ్యుదయోత్సవ మహాసభ మన చరిత్రను స్మరించుకునే వేదికగా, మన ఐక్యతను చాటే సభగా, భవిష్యత్ దిశను నిర్దేశించే సంకల్పంగా నిలవనుందని తెలిపారు. హైదరాబాద్ నాగోల్‌లోని సాయిరాం ఉద్యానవనాల్లో ఈ నెల 21న జరిగే ఈ సభ త్యాగాల పండుగగా, దివంగత నాయకులకు నివాళిగా, ప్రస్తుతం సంఘాన్ని ముందుకు నడిపిస్తున్న నాయకుల కృషికి గుర్తింపుగా ఉంటుందని అన్నారు.ఉపాధ్యాయుల సౌకర్యార్థం నాలుగు విలాసవంతమైన బస్సులు, మహిళా ఉపాధ్యాయినిలకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయ సోదర సోదరీమణులు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అభ్యుదయోత్సవాన్ని టీఆర్‌టీఎఫ్ చరిత్రలో మరపురాని ఘట్టంగా నిలపాలని పిలుపునిచ్చారు.

# అమావాస్య సందర్భంగా అన్నప్రసాద వితరణ



- ఆర్యవైశ్య సంఘం, నాగారం
- మహిళా మణుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

**నాగారం, డిసెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని నాగారం ప్రాంతంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళా మణులు విశేషంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా మహిళా మణులు స్వయంగా వంట ఏర్పాట్లు చేసి, పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ భక్తులకు అన్నప్రసాదం అందించారు. సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు సంప్రదాయాలను కాపాడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు ఆర్యవైశ్య సంఘం సభ్యులు సహకారం అందించగా, స్థానిక పెద్దలు మహిళా మణుల సేవలను అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగాలని పలువురు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# మరోసారి ఉద్యోగులకు షాకిచ్చిన అమెజాన్




అమెజాన్ సంస్థ ఉద్యోగులకు షాకిచ్చింది. యూరప్ ప్రధాన కార్యాలయం ఉన్న లక్సెంబర్గ్‌లో పెద్ద ఎత్తున లేఆఫ్స్ కు సిద్ధమైంది.రాబోయే కొన్ని వారాల్లో కార్యాలయంలో 370 మంది ఉద్యోగులను తొలగించబోతుందని తెలుస్తోంది.ప్రస్తుతం లక్సెంబర్గ్‌లో అమెజాన్‌కు సుమారు 4,370 మంది ఉద్యోగులు ఉన్నారు. గత అక్టోబర్‌లో ప్రపంచవ్యాప్తంగా 14,000 ఉద్యోగులను తొలగించనున్నట్లు అమెజాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సంస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని పెంచడం, వ్యయాలను తగ్గించుకోవడం కోసం ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. దీని వల్ల సాఫ్ట్‌వేర్ డెవలపర్లు ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని సమాచారం. కేవలం 6.8 లక్షల జనాభా ఉన్న దేశంలో ప్రత్యామ్నాయ ఉద్యోగాలు దొరకడం కష్టమవుతుందని అక్కడి ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఉండగా, కోవిడ్ సమయంలో భారీగా నియామకాలు చేపట్టిన అమెజాన్, 20222023 మధ్య ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సుమారు 27 వేల మంది ఉద్యోగులను తొలగించింది.

# రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట..
# ఒలింపిక్స్ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి కృషి





మందుముల పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, డిసెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కొనసాగుతున్న ప్రజాపాలనలో క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహకాలు కల్పిస్తూ ఒలింపిక్స్ స్థాయి లక్ష్యంగా ప్రభుత్వము కృషి చేస్తోందన్నారు.ఇండియన్ నేవీ డే సెలబ్రేషన్స్ సందర్భంగా ఎస్ఎస్ఎస్ యువసేన ఆధ్వర్యంలో నాచారం సీడీఎస్ బిల్డింగ్‌లో నిర్వహించిన 5వ కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, వారిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే విధంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ అధ్యక్షుడు బండారి శ్రీకాంత్ గౌడ్, కృష్ణారెడ్డి, ప్రకాష్ రెడ్డి, హెచ్ఆర్ మోహన్, రామ్ రెడ్డి, నందికొండ కొండ శ్రీనివాస్ రెడ్డి, సెంట్ జాన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ రామ్ రెడ్డి, ఇందిర స్కూల్ ప్రిన్సిపాల్ అన్వర్, రమణ రెడ్డి, నర్సింగ్ రావు, స్వామి, రమేష్ గౌడ్, వీ రాజు, రాజు రెడ్డి, నూతలకంటి రాజు, మహేష్ యాదవ్, కృష్ణ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, నెమలి కొండ సునీల్ రెడ్డి, మహమ్మద్ అజీమ్, శ్రీమంత్ గౌడ్, గొల్లం నరేష్, జి రాకేష్, జి క్రాంతి కుమార్, సిహెచ్ నరేష్, రాజశేఖర్, సాహిద్, షరీఫుద్దీన్, ప్రవీణ్ గౌడ్, మధు గౌడ్, టోనీ ఫ్రాన్సిస్, రేవంత్, ఉమా, చందు తదితరులు పాల్గొన్నారు.

# విపత్తు సమయంలో అవసరమైన సేవలందించేందుకు పూర్తి స్థాయి సిద్ధత







జిల్లా కలెక్టర్ మను చౌదరి

**మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్, డిసెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** ఏదైనా విపత్తు సంభవించిన సమయంలో ప్రజలకు అవసరమైన సేవలను వేగవంతంగా అందించేందుకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో సంబంధిత అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డిఎంఎ), తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వరదలు, పరిశ్రమల ప్రమాదాల నివారణపై ఈ నెల 22న నిర్వహించనున్న మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమంపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎన్‌డిఎంఎ డైరెక్టర్ సుధీర్ బాల్, తెలంగాణ ఫైర్ సర్వీస్ డైరెక్టర్ నారాయణరావు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ వరదలు, పరిశ్రమల ప్రమాదాలు, రహదారి ప్రమాదాలు సహా వివిధ రకాల విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, ముందస్తు జాగ్రత్తలపై సంబంధిత శాఖల యంత్రాంగానికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. వరదల సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడం, వరద నీటిలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి రిలీఫ్ క్యాంపుల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు తక్షణమే అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్య బృందాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విపత్తు నిర్వహణలో సమన్వయం పెంపొందించేందుకు ఏటా మాక్ ఎక్సర్సైజ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ రాధిక గుప్తా (లోకల్ బాడీస్), అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి (రెవెన్యూ), డీఆర్ఓ హరిప్రియ, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మను చౌదరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తు నిర్వహణ సమయంలో జిల్లాలో ఎస్‌డిఆర్ఎఫ్, పోలీస్ బృందాలు పూర్తిగా అప్రమత్తంగా ఉన్నాయని, లైన్ డిపార్ట్మెంట్ల అధికారులు అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏడిఎఫ్ఓ వెంకన్న, ఉప్పల్ ఎమ్మార్వో ఫూల్ సింగ్ చౌహాన్, డీఎంహెచ్ఓ డాక్టర్ సి. ఉమా గౌరీ, ఆర్టీఏఓ ఉప్పల్ వి. ఉమా, జీఎం డీఐసీ & జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎం. శ్రీనివాస్ రెడ్డి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రిలయన్స్ నుంచి సరికొత్త జెనోమిక్స్ విప్లవం




రిలయన్స్ సంస్థ వైద్య రంగంలో ఒక పెద్ద మార్పును తీసుకురావడానికి సిద్ధమవుతోంది. ఇప్పుడు అందుబాటులో ఉన్న ఖరీదైన జెనోమిక్స్ పరీక్షలను సామాన్యులకు చేరువ చేయాలని యోచిస్తోంది. దీని ద్వారా క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులను ముందుగానే గుర్తించి, చికిత్సకు సిద్ధమయ్యే అవకాశం కలుగుతుంది. సాధారణంగా ?10 వేలు పడుతున్న ఈ టెస్టును కేవలం ?వెయ్యికే అందించడం ద్వారా వైద్య సేవల్లో సమానత్వం సాధించాలని లక్ష్యం. ఈ జెనోమిక్స్ పరీక్షలు మానవ జన్యువులను విశ్లేషించి, భవిష్యత్తు రోగాల రిస్క్‌ను అంచనా వేస్తాయి. రక్త నమూనా, లాలాజలం లేదా శరీర టిష్యూను సేకరించి ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ఆధునిక టెక్నాలజీతో ఈ ప్రక్రియ సులభంగా, త్వరగా జరుగుతుంది. దీని వల్ల వ్యక్తిగత ఆరోగ్య ప్రణాళికలు రూపొందించుకోవచ్చు, ముఖ్యంగా వంశపారంపర్య వ్యాధులను ముందుగా తెలుసుకోవచ్చు. ఈ సరికొత్త విధానం ద్వారా సామాన్య ప్రజలు ముందుచూపుతో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవచ్చు. క్యాన్సర్, హార్ట్ డిసీజ్ వంటి రోగాలు ముందుగానే గుర్తిస్తే చికిత్స ఖర్చులు తగ్గుతాయి. సమాజంలో ఆరోగ్య సమస్యలను తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. రిలయన్స్ ఈ టెస్టులను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వైద్య రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తుంది. సంస్థ సీనియర్ అధికారి నీలేశ్ మాట్లాడుతూ, జెనోమిక్స్ రంగంలో తమ సంస్థ సమాజంపై ప్రభావం చూపుతుందని చెప్పారు. ఈ టెక్నాలజీని సరసమైన ధరకు అందించడం ద్వారా అనేక మంది ప్రయోజనం పొందుతారు. భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణలతో వైద్య సేవలను మెరుగుపరచాలని ఆయన వెల్లడించారు. రిలయన్స్ ఈ దిశలో ముందుకు సాగుతూ, సమాజ ఆరోగ్యానికి బలమైన మద్దతు ఇస్తుంది.

# వడ్డీ రేట్లు తక్కువగానే ఉండొచ్చు..!

రాబోయే కాలంలో వడ్డీ రేట్లు తక్కువ స్థాయిలోనే కొనసాగొచ్చని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజరు మల్హోత్రా అభిప్రాయపడ్డారు. ఈ అంచనాలో అమెరికాతో పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందాలు, యూరోపియన్ యూనియన్‌తో దాదాపు పూర్తయిన ఒప్పందాల ప్రభావాలను ఇంకా పరిగణనలోకి తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. అమెరికాతో జరిగే వాణిజ్య ఒప్పందం వల్ల ఆర్థిక వ్యవస్థపై సుమారు అర శాతం మేర సానుకూల ప్రభావం ఉండవచ్చని గవర్నర్ పేర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ త్రైమాసికంలో భారత జీడీపీ అనుహ్యంగా 8.2 శాతం వృద్ధిని సాధించడం పట్ల ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆర్బీఐ గతంలో 7 శాతం వృద్ధిని అంచనా వేయగా, కేంద్ర గణాంకాలు అంతకంటే ఎక్కువగా రావడం గమనార్హం. డేటా రివిజన్ (సవరణలు) జరిగే క్రమంలో స్వల్ప తప్పిదాలు ఉండటం సహజమేనని, అయితే మొత్తం మీద గణాంకాలు పటిష్టంగానే ఉన్నాయని తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పంచాయతీలకు 'పవర్' పరేషాన్



'భారతదేశ ఆత్మ దాని గ్రామాల్లోనే నివసిస్తుంది' అన్నారు జాతిపిత మహాత్మాగాంధీ. ఏ వ్యవస్థకైనా ఆర్థిక మూలాలు బలంగా ఉంటేనే అది బలంగా ఉంటుంది. క్షీణిస్తే ఆ వ్యవస్థ మనుగడకే ప్రమాదం. రాష్ట్రంలో మూడు దశల్లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలు ఈ నెల పదిహేడుతో పూర్తయ్యాయి. ఇక పాలకవర్గాల ప్రమాణస్వీకారం వారంలోపే జరిగే అవకాశముంది. గత సర్పంచులు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసి నిధుల కోసం అష్టకష్టాలు పడ్డారు. చాలామంది ప్రతిష్ట కోసం, మరికొంత మంది గ్రామస్తుల ఒత్తిడి మేరకు పంచాయతీలో నిధులు లేకున్నా పనులు చేసింది మాత్రం వాస్తవం. దీనికోసం చాలామంది సర్పంచులు అప్పుల పాలవడం, వాటిని తీర్చలేక ఆత్మహత్యలు చేసుకోవడం లాంటి ఘటనలు బాధాకరం. అప్పులు తీర్చలేక ఇంకొంతమంది హైదరాబాద్‌లాంటి పట్టణాలకు వలసెళ్లి వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్న పరిస్థితి దాపురించింది. రావాల్సిన బిల్లులు దాదాపు నాలుగు వందల కోట్ల రూపాయలు ఉన్నాయంటే మాటలు కాదు. అయితే ఇటీవల జరిగిన జీపీ ఎన్నికల్లో గెలుపొందిన నూతన సర్పంచులకు అరకొర నిధులు, పెండింగ్ బిల్లులు స్వాగతం పలుకుతున్నాయి. గ్రామ పాలనకు ఆధారం స్థానిక సంస్థలు. గ్రామపంచాయతీ వ్యవస్థ భారత దేశ ప్రజాస్వామ్యానికి తొలిమెట్టు. 1992వ సంవత్సరం 73వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 243 వలన గ్రామపంచాయతీ వ్యవస్థ ఏర్పడింది. గ్రామం ఒక యూనిట్ గా నవ ప్రజాస్వామ్యానికి అడుగులు పడ్డాయి. గ్రామాల అభివృద్ధికి సంబంధించిన కీలకమైన మౌలిక 23 అంశాలు రాజ్యాంగంలోని 12వ షెడ్యూల్‌లో ఉంచబడ్డాయి. రాష్ట్రంలో 12,760 గ్రామపంచాయతీలు, 567 మండల ప్రజా పరిషత్తులు, 31 జిల్లా ప్రజా పరిషత్తులు ఉన్నాయి. ఈ స్థానిక సంస్థలకు పదిహేనవ ఆర్థిక సంఘం నిధులే కీలకం. అయితే కేంద్రం నుంచి రావాల్సిన రూ.3500 కోట్ల నిధులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. దీని వలన పంచాయతీలకు ఆర్థిక కష్టాలు తప్పడం లేదు. పరిస్థితి ఇలా ఉంటే విద్యుత్ నియంత్రణ మండలి, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు గ్రామ స్వరాజ్యానికి గొడ్డలి పెట్టులా మారాయి. విద్యుత్ మండలి విధించిన 202526 సంవత్సర ధరల ప్రణాళిక ప్రజాస్వామ్యవాదులను, స్థానిక సంస్థలను, రాష్ట్ర ప్రజలను విస్మయించపరిచే విధంగా ఉన్నాయి.

స్థానిక సంస్థలైన గ్రామపంచాయతీలో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్ట్రీట్ లైట్ (వీధి దీపాల)కు వినియోగించే విద్యుత్ చార్జీలు యూనిట్‌కు ఏడు రూపాయల పది పైసలు, గ్రామీణ తాగునీటి అవసరాల కోసం వినియోగించే పంపుల విద్యుత్‌కి యూనిట్‌కు ఆరు రూపాయలు చొప్పున గ్రామపంచాయతీ నిధుల నుండి వసూలు చేస్తున్నాయి. ఇవి ప్రజల కనీస సౌకర్యాలు. వాణిజ్య అవసరాలకు ఉపయోగించే విద్యుత్ ధరలను వీటికి విధించడం అన్యాయం. దీనివలన చాలా గ్రామపంచాయతీ వ్యవస్థలు ఆర్థికంగా చితికి పోతున్నాయి. ప్రతి పంచాయతీ సగటున నెలకి రూ.25వేలు, పెద్ద పంచాయతీలైతే 50 వేలు, అలాగే ప్రతి మున్సిపాలిటీ నెలకు లక్షల్లో విద్యుత్ చెల్లించాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇంత పెద్దమొత్తం విద్యుత్ బిల్లులే కడితే ఇక గ్రామ పరిపాలన ఏ విధంగా సాధ్యం? స్థానిక సంస్థలకు వచ్చే నిధులలో సింహభాగం కేవలం విద్యుత్ కొనుగోలుకే గ్రామ పంచాయతీలు చెల్లిస్తున్నాయి. దీనివలన నిధుల కొరత ఏర్పడి గ్రామపాలన అస్తవ్యస్తంగా మారిపోతుంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి, వ్యవసాయ పంపులకు ఉచిత విద్యుత్తు పథకాలను అందిస్తున్నా మని గొప్పలు చెబుతున్నా, మరోవైపు దేశానికి పట్టుకొమ్మలైన గ్రామపంచాయతీల ప్రజల మౌలిక, అత్యవసర సేవలపై అధిక విద్యుత్ ధరలను విధిస్తూ స్థానిక సంస్థల ఆర్థిక వ్యవస్థను నడ్డివిరచడం బాధాకరం. విద్యుత్ బిల్లులు స్థానిక సంస్థల స్వయం అభివృద్ధికి కనీస అవసరాలకు షరాఘతంలా మారాయి. మరి దీనికి ప్రత్యామ్నాయం లేదా అంటే సర్కార్ ఆ దిశగా ఆలోచించడం లేదు. ప్రతి జీపీ వాటి జనాభా విద్యుత్ వినియోగాల ఆధారంగా యాభై నుండి వంద కిలోవాట్ల సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పరిచితే, రాష్ట్రవ్యాప్తంగా 700 నుండి వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. పర్యావరణ పరిరక్షణ, రాష్ట్ర విద్యుత్ భద్రత ఏర్పడటమే కాక స్థానిక సంస్థల ఆర్థిక పరిపుష్టి ఏర్పడుతుంది. కేవలం మూడు నుంచి నాలుగు వేల కోట్ల రూపాయల పెట్టుబడితో భవిష్యత్ తరాలకు వెలుగు నింపే అవకాశముంది. ఈ దిశగా అడుగులు వేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వంపై ఎంతైనా ఉన్నది.

# పాఠశాలల్లో పంతుళ్లతో పర్యవేక్షణలా?


ఉపాధ్యాయుడు అంటే విద్యార్థులకు జ్ఞానం, నైపుణ్యాలు,మంచి అలవాట్లు నేర్పే వ్యక్తి. దేశ భవిష్యత్తుకు పునాది వేసే కీలక పాత్రధారి. విద్యార్థులకు సరైన మార్గంలో నడిపించే దీపస్తంభం లాంటివారు.వ్యక్తిత్వాన్ని,నైతిక విలువలను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారు.దేశ భవిష్యత్తుకు పునాది వేసి, వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో సహాయపడతారు. విద్యార్థులలో ఉత్తమమైన లక్షణాలను ప్రోత్సహించి, దేశానికి సేవ చేసేలా ప్రేరేపించే మార్గదర్శకులు ఉపాధ్యాయులు. కానీ నేటి విద్యావ్యవస్థలో ఉపాధ్యాయుడి యొక్క స్థానం ప్రశ్నార్థకం ఉపాధ్యాయుడి ప్రథమ కర్తవ్యం గా భావించే బోధన తప్ప నేటి ఉపాధ్యాయుడు మిగిలిన కార్యక్రమాలన్నీ నిర్వహించడం ఆలోచించాల్సిన విషయం. చివరకు ఉపాధ్యాయులచే పర్యవేక్షణ బాధ్యతలు కూడా నిర్వర్తింపజేయడం కేవలం తెలంగాణ ప్రభుత్వానికే చెల్లిందనడంలో అతిశయోక్తి లేదు. సాక్షాత్తు తెలంగాణ ముఖ్యమంత్రివర్యులు అనుముల రేవంత్ రెడ్డి గారి విద్యాశాఖ మంత్రిగా ఉన్న తరుణంలో ఇటువంటి దుస్థితి నెలకొనడం శోచనీయం. పాఠశాలల పర్యవేక్షణను విద్యాశాఖ అధికారులు, డిప్యూటీ డిఈవోలు, మండల విద్యాధికారులు చేపట్టాల్సి ఉండగా రాష్ట్ర విద్యాశాఖ టీచర్లతో పాఠశాలల పర్యవేక్షణ చేయించాలని నిర్ణయించి అందుకు అనుగుణంగా ఉత్తర్వులు జారీచేయడమే ఉపాధ్యాయవర్గంలో వ్యతిరేకతకు కారణమైనది. నిజానికి పాఠశాలల పర్యవేక్షణకు ఇప్పటికే విద్యాధికారులు, డీఈవోలు డిప్యూటీ విద్యాధికారులు, మండల విద్యాధికారులతో పాటు మండల నోడల్ ఆఫీసర్లు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు ఉండగా అది చాలదన్నట్లు మళ్ళీ కొత్తగా ఉపాధ్యాయుల బృందంతో పర్యవేక్షణలు చేయించటమేమిటని ఉపాధ్యాయ సంఘాలు,79 సంవత్సరాల చరిత్ర గల స్టేట్ టీచర్స్ యూనియన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇప్పటికే చాలామంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్, ఫారిన్ సర్వీసుల పేర్లతో మండల విద్యా వనరుల కేంద్రం నుండి పాఠశాల విద్యాశాఖ కార్యాలయం వరకు బడులకు, బోధనకు దూరంగా పనిచేస్తున్నారు.మళ్ళీ పర్యవేక్షణ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు రెండు వేలకు పైగా టీచర్లను బోధనకు దూరం చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. పర్యవేక్షణను వద్దనడంలేదు కానీ పర్యవేక్షణ ఎవరు చేయాలో వారే చేయాలి గానీ టీచర్లను పర్యవేక్షణకు పంపడంవల్ల ఆ ఉపాధ్యాయులు బోధనకు దూరం అవుతారని తద్వారా ఆ పాఠశాల విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని ఇటువంటి అనాలోచిత ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని ఎస్టీయూ ఇప్పటికే అధికారులకు ప్రాతినిధ్యం చేసినది.

ఇప్పటికే పాఠశాలలో ఉపాధ్యాయులు రోజులో సగానికి పైగా బోధనేతర పనులతో సతమవుతున్నారు. విద్యార్థులకు ఫెసియల్ రికగ్నిషన్ యాప్ ద్వారా హాజరు,రాగి జావా ,మధ్యాహ్న భోజనం,అల్పాహారం పంపిణీ అధికారులు అడిగే వివిధరకాల ప్రొఫార్మాలను నింపడం పంపడం తోటే సమయం సరిపోతుంది. ఇప్పుడు పర్యవేక్షణ పేరుతో కొంతమంది ఉపాధ్యాయులను నియమించడంతో ఉన్న ఉపాధ్యాయులపై అదనపు భారం పడనుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకుండా పోతుంది. ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చి,నూతన ఉపాధ్యాయుల నియామకం చేపట్టిన ప్రభుత్వం డిప్యూటీ విద్యాధికారులు, యం ఈ వోల పోస్టుల భర్తీకై తగిన నిర్ణయం తీసుకోవాలి. పక్క తెలుగు రాష్ట్రంలో వియమించినట్లు పరిపాలనకు ఒక అధికారి, అకడమిక్‌కు ఒక అధికారి అన్నట్లు ఇద్దరు యంఈవోలను నియమించాలి.ఉమ్మడి సర్వీసు రూల్స్ పేరుతో జాప్యం చేయడం వల్ల విద్యాశాఖకు తీరనినష్టం చేకూరుతుంది. ఇప్పటికే ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్నది. ఇప్పుడు పర్యవేక్షణ పేరుతో మరికొంతమంది పాఠశాల్లో బోధనకు దూరమవుతారనేది వాస్తవం ఇప్పటికైనా గౌరవ ముఖ్యమంత్రి గారు చొరవ తీసుకుని ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్న విద్యావ్యవస్థను పరిరక్షించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.



# గెలిచినా.. ఓడినా అప్పులే మిగిలాయి

తెలంగాణ రాష్టంలో సర్పంచ్ ఎన్నికలు ముగిశాయి. గ్రామాల్లో నినాదాలు ఆగిపోయాయి. విజయసంబరాలు కూడా చేశారు. కానీ ఎన్నికల తర్వాత గ్రామాల్లో నెలకొన్న నిశ్శబ్దం ఆనందాన్ని కాదు, ఆందోళనను ప్రతిబింబిస్తోంది.ఆ నిశ్శబ్దంలో వినిపిస్తున్నది అభివృద్ధి చర్చ కాదు అప్పుల లెక్కల మాట.... ఎవరితో ఎన్ని డబ్బులు తెచ్చినాము, ఎంత బంగారం తాకట్టు పెట్టినాము, అనే ఆలోచన వెంటాడుతున్నది.. ఈ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచినా ఓడినా అభ్యర్థులందరూ ఇప్పుడు ఒకే మానసిక వేదన ఎదుర్కొంటున్నారు. గెలిచినా ఓడినా ఎన్నికల్లో పెట్టిన పెట్టుబడి భారమే కళ్లకు కనిపిస్తుంది. గ్రామానికి సేవ చేయాలనే ఆశయం వెనక్కి నెగ్గి, ''పెట్టుబడి ఎలా భరించాలి'' అనే మానసిక ప్రశ్నే రాజకీయ చర్చల కేంద్రంగా మారింది. గెలిచిన సర్పంచ్‌లకు పదవి లభించినా, ఆ పదవితో పాటు వచ్చినది ఊరట కాదు. ఎన్నికల్లో పెట్టిన ఖర్చును తిరిగి చెల్లించాలనే ఒత్తిడి గ్రామ పాలనపై మొదటి నీడగా పడుతోంది. అభివృద్ధి ప్రణాళికలు ఆలోచించేలోపే, అప్పులు చేసిన లెక్కలే ముందుకు వస్తున్నాయి. ఫలితంగా గ్రామ అవసరాల కంటే ఆర్థిక ఒత్తిడే నిర్ణయాలను ప్రభావితం చేసే పరిస్థితి ఏర్పడుతోంది. ఓడిపోయిన అభ్యర్థుల పరిస్థితి మరింత బాధాకరం. ఎన్నికల్లో పెట్టిన పెట్టుబడి తిరిగి రాకపోవడం, అప్పుల ఒత్తిడి, గ్రామంలో తల ఎత్తుకోలేని పరిస్థితి ఇవన్నీ వారిని లోపల నుంచి నలిపేస్తున్నాయి. పోలింగ్ కంటే ముందు రోజులు, పోలింగ్ జరిగిన తర్వాత కూడా అభ్యర్థుల దగ్గరకి వెళ్లి డబ్బులు అడిగి తీసుకెళ్లిన సంఘటనలు ప్రతి గ్రామంలో ఉన్నాయి. ఇది రాజకీయ ఓటమి కాదుబీ సామాజిక సంక్షోభం. తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి ఖమ్మం జిల్లా సహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఎన్నికల తర్వాత ఇదే దృశ్యం కనిపిస్తోంది. గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికల చర్చలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. వాటి స్థానంలో అప్పుల చర్చలు, ఖర్చుల లెక్కలే వినిపిస్తున్నాయి. ప్రజలు కూడా గెలిచిన నాయకుడి వద్ద అభివృద్ధిని ప్రశ్నించడానికి సంకోచిస్తారు. ఈ పరిస్థితి వ్యక్తుల వైఫల్యం కాదు. ఇది పెట్టుబడి రాజకీయాల ప్రత్యక్ష ఫలితంగా భావించాలి. ఎన్నికల్లో పెట్టుబడి పెట్టినప్పుడు, ఆ పెట్టుబడికి లాభం రావాలనే




ఆలోచన సహజంగా ప్రతి మనిషికి వస్తుంది. ఆ లాభం అభివృద్ధి ద్వారా కాదు లావాదేవీల ద్వారా వచ్చే ప్రమాదమే ఎక్కువ. సర్పంచ్ ఎన్నికలు ముగిసిన తర్వాత గెలిచినవారు, ఓడినవారు ఇద్దరూ బాధితులైతే, ఈ ఎన్నికల్లో నిజంగా ఓడిపోతున్నది గ్రామాభివృద్ధే అనేది నిజం. గ్రామ రాజ్యం అప్పుల భారంతో క్రమంగా క్షీణిస్తోంది. సర్పంచ్ ఎన్నికలు సేవకు వేదికగా తిరిగి మారాలంటే, ఖర్చుల రాజకీయాలకు ముగింపు పలకాల్సిందే. లేకపోతే ప్రతి ఎన్నిక తర్వాత ఇదే దీనగాథ గెలుపు లేని ఓటమి గ్రామాల మీద , ఆ గ్రామాల అభివృద్ధి మీద ఉంటుంది. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఒక సర్పంచ్ అభ్యర్థి తన ప్రత్యర్థి విపరీతంగా డబ్బులు పంచుతున్నాడని, తనకు ఓటమి తప్పదని భావించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ప్రజాస్వామ్యంలో ఎన్నికల పరిస్థితిని కళ్లకు కట్టేలా ఉంది. ... ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలలో నేను ఒక జర్నలిస్టుగా ప్రత్యక్ష్యంగా చూసాను. కనుక వారి ఆవేదన అర్థం చేసుకున్నాను. గ్రామ ప్రజాస్వామ్యం నేడు అప్పుల భారంతో కుంగిపోతోంది. సర్పంచ్ ఎన్నికల్లో పెరుగుతున్న పెట్టుబడి రాజకీయాలు అభివృద్ధి ఆలోచనను మూలకు నెట్టేస్తున్నాయి. రాజకీయ నాయకులు, పాలకులు ఈ వాస్తవాన్ని నిర్లక్ష్యం చేస్తే దాని మూల్యం గ్రామాలే చెల్లించాలి. ఎన్నికల ఖర్చులపై కఠిన నియంత్రణలు అమలు చేయడం, అక్రమాలకు రాజకీయ రక్షణను పూర్తిగా తొలగించడం, ఖర్చులపై పారదర్శకత తీసుకురావడం తప్పనిసరి కావాలి. రాబోయే ఎంపీటీసీ, జెడ్ పి టి సి, మునిసిపల్ ఎన్నికలలో మార్పు తెచ్చే దిశగా అధికారులు, పాలకులు చొరవ తీసుకోవాల్సిన తరుణ ఆసన్నమైంది. ఎన్నికలు ముగిశాక గెలిచినవారు,ఓడినవారు ఇద్దరూ బాధితులుగా మారితే, అది ప్రజాస్వామ్యానికి పరాజయం. ఈ పరిస్థితి మారాల్సిందే. మార్పు మాటల్లో కాదు నిర్ణయాల్లో కనిపించాలి. గ్రామ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే, ఈ హెచ్చరికను ఇప్పుడే గంభీరంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## వ్యవసాయ సహకార పాలకవర్గాల రద్దు

### గడువు ముగియడంతో ప్రభుత్వం ఉత్తర్వులు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్ల పాలక వర్గాలను రద్దు చేసింది. అలాగే తొమ్మిది జిల్లాల డీసీసీబీలను సైతం తొలగించింది. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ డీసీసీబీల పాలకమండళ్ల కాలపరిమితి ముగియడంతో రద్దు చేసినట్లు తెలిపింది. ఈ మేరకు పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌ఛార్జిలను నియమించాలని వ్యవసాయశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ ఇన్‌ఛార్జిలు కొనసాగుతారని పేర్కొంది. ఈ ఏడాది ఆగస్టు 14వ తేదీతో పీఏసీఎస్‌ల పదవీకాలం ముగిసిందని ప్రభుత్వం వివరించింది. వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ సహకార సొసైటీల నిర్వహణకు ఎన్నికల ద్వారా పాలకవర్గాలను నియమిస్తుంది. సొసైటీల సామర్థ్యాలకు అనుగుణంగా చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు ఉంటారు. ఎన్నికైన పాలకవర్గాలు ప్రభుత్వం ద్వారా వ్యవసాయ, దాని అనుబంధ రంగాల అభివృద్ధికి రైతుల సంక్షేమానికి అమలయ్యే పథకాలను అందిస్తాయి. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికల ద్వారా ఈ పాలకవర్గాలను ప్రభుత్వం నియమిస్తుంది. 2020, ఫిబ్రవరిలో కేసీఆర్ ప్రభుత్వం ఈ ఎన్నికలను నిర్వహించింది. ఈ ఎన్నికల ద్వారా పదవులు పొందిన వారి పదవి కాలం ఈ ఏడాది ఫిబ్రవరితో ముగిసింది. వారి పదవి కాలాన్ని ఆరు నెలల పొడిగించింది. తాజాగా పాలకవర్గాలను రద్దు చేసింది.

# బెట్టింగ్ యాప్స్ కేసులో ఇడి దూకుడు

- సోనూసూద్ సహా మాజీ క్రికెటర్లు యువరాజ్, ఊతప్పల ఆస్తుల అటాచ్

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**



బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో విచారణ ముమ్మరంగా సాగుతోంది. ఈ కేసులో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప, బాలీవుడ్ నటులు సోనూసూద్, నేహాశర్మ ఆస్తుల్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసింది. ఆ జాబితాలో నటి ఊర్వశీ రౌతేలా తల్లితో పాటు టీఎంసీ మాజీ ఎంపీ మిమి చక్రవర్తి, బెంగాలీ నటుడు అంకుశ్ హజ్రా కూడా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు సంస్థ వీరిని ఇప్పటికే విచారించగా.. తాజాగా అటాచ్ చేసిన ఆస్తుల విలువ రూ.7.93 కోట్లని సంబంధిత వర్గాలు వెల్లడిరచాయి. గతంలో మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌కు చెందిన రూ.11.14 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఇద్దరు మాజీ క్రికెటర్లు అన్ని విషయాలు తెలిసే వివిధ సంస్థల ప్రమోషన్ కోసం విదేశీ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారని గుర్తించింది. ఈ నేపథ్యంలోనే శిఖర్ ధావన్‌కు చెందిన రూ.4.5 కోట్ల స్థిరాస్తిని, సురేశ్‌కు చెందిన రూ.6.64 కోట్ల విలువైన మ్యూచువల్ ఫండ్‌లను సీజ్ చేసేందుకు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల పార్లమెంట్ వేదికగా రియల్ మనీ ఆన్‌లైన్ గేమింగ్‌ను బ్యాన్ చేసిన సంగతి తెలిసిందే. బెట్టింగ్ యాప్స్ కోసం సెలబ్రెటీలు కోట్ల రెమ్యూనరేషన్ తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఇటీవల బెట్టింగ్ యాప్స్ కోసం ప్రమోషన్ చేసిన వారిపై ఈడీ కొరడా ఝులిపిస్తుంది. ఆన్‌లైన్ బెట్టింగ్, మనీ లాండరింగ్ నిరోధక చట్టం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అధికారులు దూకుడు పెంచారు. పీఎంఎల్ ఏ కేసులో ప్రముఖుల ఆస్తులను అటాచ్ చేశారు. ఇప్పటికే నటులు సోనూసూద్, నేహాశర్మ ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ, తాజాగా మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఊతప్ప, టీఎంసీ మాజీ ఎంపీ మిమి చక్రవర్తి, నటి ఊర్వశి రౌతేలా తల్లి ఆస్తులు సైతం అటాచ్ చేశారు.





# ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం

## 74శాతం ఫిర్యాదులు పరిష్కరించాం

### రెండేళ్ల ప్రజావాణి వార్షికోత్సవంలో భట్టి

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందుకోసం తామంతా అహరహం శ్రమిస్తున్నామని అన్నారు. అలాగే సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ప్రారంభించిన రెండేళ్లల్లో ఇప్పటి వరకు 74 శాతం ఫిర్యాదులు పరిష్కరించామని తెలిపారు. బేగంపేట ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రజావాణి 2వ వార్షికోత్సవానికి భట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజావాణి ఇన్‌ఛార్జి దివ్యదేవరాజన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్దిదారుల తమ అనుభవాల పంచుకున్నారు. అంకితభావంతో సేవలు అందించి.. ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేసిన అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... రాష్ట్రంలోని వివిధ వర్గాల నుంచి వస్తున్న అనేక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి, అన్ని శాఖలతో సమన్వయం చేస్తున్నామని తెలిపారు. ప్రజావాణికి స్పందన లేదని విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆక్షేపించారు. ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అధికారానికి దూరమైన విపక్షం ఎన్ని విమర్శలు చేసినా.. తాము మరింత ముందుకు వెళ్తామన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో వనరులు ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజావాణి విజయవంతం చేసిన చిన్నారెడ్డి, దివ్యాదేవరాజన్‌కు భట్టి అభినందనలు తెలిపారు.





# ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణ

### ఫిల్మ్, టెలివిజన్ ఎకో సిస్టమ్ మరింత అభివృద్ధి
### షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

దేశంలోనే ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణను మార్చాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణలో ఫిల్మ్, టెలివిజన్ ఎకో సిస్టమ్‌ను మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. సులభంగా, సౌకర్యవంతంగా సినిమాల నిర్మాణానికి తెలంగాణ ఎంతో అనుకూలంగా మారిందన్నారు. సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు సహా పలువురు సినీ ప్రముఖులు, విశ్లేషకులతో కలిసి హైదరాబాద్ ప్రసాద్ ఐమ్యాక్స్‌లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ మొదటి ఎడిషన్‌ను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి వెంకట్ రెడ్డి.. ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ `2025.. మన హైదరాబాద్‌కు, మన తెలంగాణకు ఒక మంచి ఆరంభం అని పేర్కొన్నారు. హైదరాబాద్ అంటేనే సినిమాగా పేరుగాంచింద న్నారు. దేశం నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చి సినిమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. పెద్ద సినిమాలు ఒకవైపు.. షార్ట్ ఫిల్మ్స్ మరోవైపు తీయడం వల్ల హైదరాబాద్ పేరు ప్రఖ్యాతలు మరింత పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. కొత్త టాలెంట్ ఎక్కువగా షార్ట్ ఫిల్మ్స్ నుంచి వస్తోందన్నారు మంత్రి. షార్ట్ ఫిల్మ్స్ యువతకు ఫ్రీడమ్ ఇస్తాయని.. కొత్తగా ఆలోచించడానికి.. కొత్తగా ట్రై చేయడానికి.. తమ కథని తమ స్టైల్‌లో చెప్పడానికి.. అవకాశాన్ని కల్పిస్తాయన్నారు కోమటిరెడ్డి. ఈరోజు పెద్ద స్థాయిలో ఉన్న చాలామంది ఫిల్మ్ మేకర్స్ మొదట షార్ట్ ఫిల్మ్స్‌తోనే మొదలుపెట్టారని గుర్తు చేశారు మంత్రి. సినిమాటోగ్రఫీ మంత్రిగా తాను ఒక విషయం స్పష్టంగా చెప్తున్నానని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సినిమా రంగానికి పూర్తి మద్దతుగా ఉంటుందని భరోసా ఇచ్చారాయన. 'మంచి టాలెంట్‌కు అవకాశం రావాలి.. యువ ఫిల్మ్ మేకర్స్ ముందుకు రావాలి.. వాళ్లకు సరైన ప్లాట్‌ఫామ్ ఉండాలి.. అదే మా ప్రభుత్వ ఆలోచన.' అని ఉద్ఘాటించారు మంత్రి కోమటిరెడ్డి. తమ లక్ష్యం చాలా సింపుల్ అని.. దేశంలోనే ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణను మార్చాలన్నారు. అనుమతులు ఈజీగా ఉండాలి. సదుపాయాలు బాగుండాలి. అందుకోసం ప్రభుత్వం సీరియస్‌గా పని చేస్తోంది. ఈ ఫెస్టివల్‌లో నాకు ప్రత్యేకంగా నచ్చిన విషయం ఒకటి ఉంది. నార్త్ ఈస్ట్ రాష్ట్రాల నుంచి వచ్చిన ఫిల్మ్ మేకర్స్ పాల్గొనడం అని అన్నారు. ఎనిమిది రాష్ట్రాల కథలు ఇక్కడ మనం చూస్తున్నాం. హైదరాబాద్ అంటే మినీ ఇండియా. ఇలాంటి కార్యక్రమాలు మన దేశాన్ని ఇంకా దగ్గర చేస్తాయి. ఇక్కడ ఉన్న ప్రతి ఫిల్మ్ మేకర్‌కు నేను చెప్పదలుచుకున్నది ఒక్కటే. అవార్డు వచ్చినా రాకపోయినా.. మీ కథకి విలువ ఉంది. 15`20 నిమిషాల షార్ట్ ఫిల్మ్ కూడా మనసులను తాకగలదు. ధైర్యంగా కొత్త కథలు చెప్పండి. ముందుకు వెళ్లండి.' అంటూ యువ ఫిల్మ్ మేకర్స్‌లో ఉత్తేజాన్ని నింపారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. హైదరాబాద్‌లో ఇంటర్నేషల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించడం తెలంగాణకు మైలురాయిగా పేర్కొన్న మంత్రి కోమటిరెడ్డి.. యువ ప్రతిభావంతులను వెలికితీసేందుకు, కొత్త ఆలోచలనకు అంకురార్పణ చేసేందుకు లఘు చిత్రాలు ఎంతో దోహదపడతాయన్నారు. సినిమాల్లో ప్రజల సంస్కృతి, జీవన విధానాన్ని ప్రతిబింబించాలని మంత్రి జూపల్లి.. ఔత్సాహిక దర్శక నిర్మాతలకు సూచించారు.

కాగా, ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, ఎఫ్‌డీసీ ఎండీ సీహెచ్ ప్రియాంక, నిర్వాహకులు ఉమా మహేశ్వరరావు, ఇతర ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఎఫ్‌డీసీ, దాదా సాహెబ్ పాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్, తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఐమ్యాక్స్‌లో రేపు, ఎల్లుండి ఇంటర్నేషల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో చిత్రాలను ప్రదర్శించనున్నారు. సుమారు 10 దేశాల నుంచి 700కుపైగా లఘు చిత్రాలు ప్రదర్శనకు రాగా.. వాటిలో ఉత్తమ చిత్రాలను జ్యూరీ సభ్యులు ఎంపిక చేసి ప్రదర్శించనున్నారు.








# ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు పెద్దపీట

- సమస్యలపై వేగంగా స్పందించి.. చర్యలు తీసుకోవాలి
- వికసిత భారత్ లక్ష్య సాధనలో సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకం
- పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సులో రాష్ట్రపతి ముర్ము

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

ఉద్యోగ నియామకాల విషయంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు వేగంగా స్పందిస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నా. 1950 తర్వాత యూపీఎస్సీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఏర్పాటు మొదలైంది. ఈ విషయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కీలక పాత్ర పోషించారు. నియామకాల్లో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలి. ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కారం అవసరం అని రాష్ట్రపతి అన్నారు. నియామకాల్లో పారదర్శకత, ప్రజల్లో విశ్వసనీయత పెంచడంపై దృష్టిసారించాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు.నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 2047 వికసిత భారత్ లక్ష్య సాధనలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అలాగే నియామకాల్లో పారదర్శకత, నైతికత అవసరమని స్పష్టం చేశారు. నైపుణ్యాలు నేర్పవచ్చని కానీ సమగ్రత లోపాన్ని మాత్రం భర్తీ చేయలేమన్నారు. టెక్నాలజీ సవాళ్లను ఎదుర్కొనేలా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కమిషన్ చైర్మన్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్లు.. ఈ సదస్సుకు హాజరయ్యారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరీక్షల నిర్వహణలో అనుసరించాల్సిన పద్ధతులు, పరస్పర సహకారంపై ఈ సదస్సులో చర్చించనున్నారు. సదస్సుకు హాజరైన రాష్ట్రపతి ముర్ముకు రామోజీ ఫిలింసిటీలో ఘన స్వాగతం పలికారు. ఆమె వెంట తెలంగాణకు చెందిన పలువురు మంత్రుల తోపాటు ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ,యూపీఎస్సీ చైర్మన్ అజయ్‌కుమార్, యూపీఎస్సీ కార్యదర్శి శశి రంజన్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సదస్సు శనివారంతో ముగియనుంది. ఈ సదస్సుకు భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరుకానున్నారు. అంతకుముందు బొల్లారం రాష్ట్రపతి భవన్ నుంచి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రామోజీ ఫిల్మ్‌సిటీకి చేరుకున్నారు. దేశంలోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శీతాకాల విడిది కోసం హైదరాబాద్ వచ్చిన ద్రౌపదీ ముర్ము.. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో రామోజీ ఫిల్మ్‌సిటీకి చేరుకున్నారు. రాష్ట్రపతి వెంట గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి సీతక్క ఉన్నారు. దేశంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు. సదస్సు అనంతరం సాయంత్రం రామోజీ ఫిల్మ్‌సిటీలో వివిధ ప్రదేశాలను ద్రౌపదీ ముర్ము సందర్శించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# లవ్ అండ్ యాక్షన్ డ్రామా 'డెకాయిట్'



వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో దూసుకుపోతున్న అడివి శేష్ తన ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'డెకాయిట్'తో అలరించబోతున్నారు. షానియల్ డియో దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. ఈ లవ్, యాక్షన్ డ్రామాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్ కాగా బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. కాగా శేష్ పుట్టినరోజు సందర్భంగా అద్భుతమైన టీజర్‌ను విడుదల చేశారు. టీజర్ లవ్ స్టోరీ, రూత్ లెస్ జర్నీ, ఒక పెద్ద లక్ష్యంతో నడిచే హీరోని ప్రజెంట్ చేస్తోంది. ప్రేమ, దోపిడీ ఈ రెండు ప్రధాన అంశాల చుట్టూ కథనం అద్భుతంగా వుంది.మొదటిసారిగా మాస్‌ఓరియెంటెడ్ పాత్రలో కనిపించిన అడివి శేష్ అదరగొట్టారు. మల్టీ షేడ్స్‌తో.. రగ్గడ్ అవతార్‌లో హీరో కనిపించిన తీరు అదిరిపోయింది. మదనపల్లె యాసలో మాట్లాడిన విధానం ఆకట్టుకుంది. మృణాల్ ఠాకూర్ పాత్ర శేష్ పాత్రతోపాటు ప్రయాణిస్తూ.. అమాయకత్వం, ఎమోషన్ మధ్య ఊగిసలాడుతూ కథనానికి డెప్త్‌ను జోడిస్తుంది. టీజర్ అనురాగ్ కశ్యప్, ప్రకాష్ రాజ్, అతుల్ కులకర్ణి, సునీల్‌లను కీలక పాత్రలలో పరిచయం చేస్తుంది. అనుభవజ్ఞులైన నటుల అద్భుతమైన తారాగణం శక్తివంతమైన ఆన్‌స్క్రీన్ ఎక్స్ పీరియన్స్ అందించడానికి సిద్ధంగా వుంది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో ఈ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సాంకేతికంగా టీజర్ అత్యున్నతంగా వుంది.

# షూటింగ్‌లో తీవ్రంగా గాయపడ్డ ఆది



షూటింగ్ సమయంలో నటీనటులు గాయపడటం కొత్తేమి కాదు. ఎంతో మంది హీరోలు యాక్షన్ సీన్స్ చేస్తుండగా.. గాయపడ్డారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ అవాంఛనీయ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల 'కాంతార:చాప్టర్ 1' షూట్ జరుగుతండగా.. ఏకంగా ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇలాంటి సంఘటనలు ఇటీవల చాలానే చోటుచేసుకుంటూ అభిమానుల్లో ఆందోళనను కలిగిస్తున్నారు. తాజాగా, మరో హీరో యాక్షన్ సీన్స్ చేస్తుండగా.. గాయపడినట్లు మూవీ మేకర్స్ వెల్లడించారు. ఆది సాయి కుమార్ 'శంబాల' మూవీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక ఈ సినిమాకు సంబంధించిన యాక్షన్ సీన్స్ షూట్ జరుగుతుండగా.. అనుకోకుండా.. ఆది తీవ్రంగా గాయపడ్డారు. రాత్రి పూట షూటింగ్‌లో చాలామంది నటీనటులున్నారు. వారి కోసం ఆది రెస్ట్ తీసుకోకుండా గాయాలతోనే రాత్రి మొత్తం షూటింగ్‌లో పాల్గొని సినిమా పట్ల తనకున్న డెడికేషన్‌ను చూపించారని చిత్రబృందం ప్రశంసలు కురిపించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో అభిమానులు కాస్త ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు కోలుకున్నాడా? లేదా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు అయితే ఆదిపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. కాగా.. యుగంధర్ ముని దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'శంబాల' ఏ మిస్టిక్ వరల్డ్ అనే ట్యాగ్‌లైన్‌తో రాబోతుంది. ఇందులో ఆదికి జోడీగా అర్చనా అయ్యర్ నటిస్తుంది. ఈ చిత్రాన్ని రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న 'శంబాల' క్రిస్మస్ కానుకగా విడుదల కాబోతుంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన అన్ని బిజినెస్‌లు క్లోజ్ అయ్యాయి. హాట్ కేక్‌లా ఓటీటీ, శాటిలైట్స్ రైట్స్ భారీ ధరకు అమ్ముడయ్యాయి. నైజాంలో మైత్రీ ఏపీలో సీడెడ్‌లో ఉషా పిక్చర్ వంటి భారీ సంస్థలు డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాయి.



# నాకు ఒక పెద్ద ప్రమాదం జరిగింది

కన్నడ స్టార్ కిచ్చా సుదీప్ తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితమే. నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన 'ఈగ' మూవీలో కిచ్చా సుదీప్ విలన్‌గా కనిపించి ఫుల్ పాపులారిటీ దక్కించుకున్నాడు.ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలవడంతో కిచ్చా రేంజ్ మారిపోయింది. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించినప్పటికీ పెద్దగా హిట్ అందుకోలేకపోయాయి. ఇక గత ఏడాది వచ్చిన 'మ్యాక్స్' కూడా పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. ప్రస్తుతం కిచ్చా సుదీప్ 'మార్క్' చిత్రంతో రాబోతున్నారు. ఆయన కెరీర్‌లో 47వ ప్రాజెక్ట్‌గా రానుంది. షూట్ పూర్తి చేసుకుని క్రిస్మస్ కానుకగా రాబోతుంది. దీంతో ప్రమోషన్స్ జోరు పెంచిన కిచ్చా సుదీప్ షాకింగ్ కామెంట్స్ చేశాడు. ఉనా మొదటి సినిమా షూటింగ్ పూర్తి కాలేదు. నా రెండో మూవీ విడుదల కాలేదు. నా మూడో సినిమాలో కేవలం మూల సీట్లు మాత్రమే నిండాయి. ఆ సమయంలో, మా నాన్న నాకు మరో అవకాశం ఇచ్చి, నా తర్వాతి ప్రాజెక్ట్ కూడా విఫలమైతే, నువ్వు ఇండస్ట్రీని వదిలేయాలని చెప్పారు. అప్పుడు చియాన్ విక్రమ్ నటించిన సేతు సినిమాను కన్నడలో రీమేక్ చేశారు. గుండు లుక్ కారణంగా చాలా మంది నటీనటులు ఆ సినిమాను తిరస్కరించారు. నేను ఆ సినిమాను అంగీకరించాను. షూటింగ్ ఏడవ రోజున నాకు ఒక పెద్ద ప్రమాదం జరిగింది. చివరికి ఆ సినిమా విడుదలైంది.. నాకు నా కెరీర్‌లో ఒక పెద్ద బ్రేక్ లభించింది'' అని అన్నారు. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## హోటల్‌కి రమ్మని నన్ను బలవంతం చేశాడు



గత కొద్ది కాలంగా సినీ ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ పదం మార్మోగిపోతుంది. సినీ తారలు తమకు ఎదురైన అనుభవాలను ధైర్యంగా చెబుతూ వార్తల్లో నిలుస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. గతంలో చాలామంది హీరోయిన్లు తమకు ఎదురైన చేదు అనుభవాలను పంచుకున్న విషయం తెలిసిందే. తాజాగా, మరో నటి తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని వివరించింది. బాలీవుడ్ బ్యూటీ మాల్టీ చాహర్‌ఇటీవల సల్మాన్ ఖాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న బిగ్‌బాస్ సీజన్ 19లో కనిపించిన ఆమె ఓ పాడ్‌కాస్ట్‌కు హాజరై.. షాకింగ్ విషయాలు చెప్పింది. ఉఒక ఆఫీస్ మీటింగ్‌లో వీడ్కోలు సమయంలో నాకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. ఓ దక్షిణాది నిర్మాతతో సమావేశమైనప్పుడు అతను హోటల్ గది నంబర్ నాకు ఇచ్చాడు. నేను సాధారణంగా పిలిచాడని వెళితే.. నన్ను ముద్దు పెట్టుకోవాలని ప్రయత్నించాడు. అది నాకు చాలా అసౌకర్యంగా అనిపించింది. వెంటనే అతన్ని నేను అడ్డుకున్నాను. కానీ అతను నన్ను బలవంతం చేశాడు. అయినా అక్కడి నుంచి తప్పించుకున్నాను. ఆ తర్వాత అతనితో అన్ని సంబంధాలను తెంచుకున్నా. అక్కడే అతన్ని నిలదీశా. నువ్వు నా తండ్రిలా అనుకున్నానని చెప్పా ఆ సంఘటన నాకు ఒక గుణపాఠం నేర్పింది. ఎవరినీ కూడా ఉన్నత స్థానంలో ఉంచొద్దని నిర్ణయానికి వచ్చాను. మహిళలు అవకాశాలు కోసం ఇలాంటి వాటికి అంగీకరించవద్దు. మీపై మీకు నియంత్రణ ఉండాలి'' అని చెప్పింది. కాగా.. మాల్టీ చాహర్ సినిమాల విషయానికొస్తే.. 2018లో అనిల్ శర్మ దర్శకత్వంలో వచ్చి 'జీనియస్' మూవీలో రూబీనా పాత్రలో కనిపించింది. అలాగే 'ఇష్క్ పాష్మినా' చిత్రంలో కూడా నటించిన ఆమె సోషల్ మీడియాలోనూ తన హాట్ ఫోటోలు షేర్ చేస్తూ ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది. ప్రస్తుతం పెద్దగా సినిమా అవకాశాల ఎక్కువగా రాకపోవడంతో.. అనేక బ్రాండ్లకు ప్రచారకర్తగా పనిచేస్తోంది.

# అదే నా డ్రీమ్

'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన రకుల్ ప్రీత్ సింగ్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. ఇక ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే వరుస విజయాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. అలా రామ్ చరణ్, ఎన్టీఆర్, అల్లు అర్జున్, రవితేజ, మహేష్ బాబు వంటి స్టార్ హీరోల సరసన నటించి మంచి క్రేజ్ సంపాదించింది. ఇక 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'లక్ష్యం', 'సరైనోడు', 'నాన్నకు ప్రేమతో', 'ధ్రువ' వంటి సూపర్ హిట్స్‌తో టాలీవుడ్‌లో టాప్ రేంజ్‌లో నిలిచింది. అయితే ఈ మధ్య రకుల్‌కి టాలీవుడ్‌లో అవకాశాలు కరువయ్యాయి. దీంతో బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తుంది. ఇక ఈ భామ పర్సనల్ లైఫ్ విషయానికి వస్తే నిర్మాత జాకీ భగ్నానిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. అప్పటినుంచి భర్తతో మ్యారేజ్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తుంది. ఇదిలా ఉంటే.. తాజాగా టాలీవుడ్ నుండి బాలీవుడ్ వరకు ఎందరో హీరోయిన్‌లకు వివిధ సినిమాలలో మేకప్ వేస్తూ వచ్చిన ప్రముఖ మేకప్ మాన్ కడాలి చక్రవర్తి(చక్రి) హైదరాబాద్‌లోని పంజాగుట్టలో నూతనంగా "సెకండ్ స్కిన్ మేకప్ స్టూడియో, అకాడమీ" ప్రారంభించడం జరిగింది. గతంలో రకుల్ ప్రీత్ సింగ్, తమన్నా వంటి ఎందరో స్టార్ హీరోయిన్లకు మేకప్ మెన్‌గా పనిచేసిన చక్రి తానే సొంతంగా ప్రారంభించిన ఈ నూతన మేకప్ స్టూడియోను ప్రముఖ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మీడియా వారు అడిగిన ప్రశ్నలకు రకుల్ ప్రీత్ సింగ్ సమాధానం ఇస్తూ.. "ఇటీవల కాలంలో తెలుగు సినిమాలు చేయకపోవడం వల్ల నేను తెలుగు సినిమాలను, తెలుగు వారిని ఎంతగానో మిస్ అవుతున్నాను. తప్పకుండా నేను తెలుగులో సినిమాలు చేస్తాను. నాకు తొలి విజయం అందించింది తెలుగు సినిమానే. నన్ను తెలుగు ప్రజలు అంతగా ఆదరించారు. ఒక చక్కటి కథ కోసం ఎదురుచూస్తున్నాను. నాకు మంచి తెలుగు కథ రావాలని నా అభిమానులంతా నా కోసం ప్రార్థించండి.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in